www.bharathasakthi.com

# భారత శక్తి®

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

| సంపుటి : 21 | సంచిక : 37 | హైదరాబాద్ | శనివారం,జులై 11 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00 |
|---|---|---|---|---|---|

## అరెస్టు చేసినా, చంపేసినా సిద్ధమే..
## బంగ్లాదేశ్‌కు వెళ్లి తీరుతాను: షేక్ హసీనా



బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధినేత్రి షేక్ హసీనా కీలక ప్రకటన చేశారు. స్వదేశంలో మరణశిక్షను ఎదుర్కొంటున్నప్పటికీ, ఈ ఏడాది డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లి న్యాయస్థానం ముందు లొంగిపోవాలని నిర్ణయించుకున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్న 78 ఏళ్ల హసీనా, ఒక మీడియా సంస్థకు టెలిఫోన్ ద్వారా ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఈ విషయాలను స్పష్టం చేశారు. తనతో పాటు పార్టీకి చెందిన ఇతర సీనియర్ నాయకులు కూడా స్వదేశానికి తిరిగి వస్తారని ఆమె పేర్కొన్నారు.

2లో..

## చర్లపల్లి జైలు నుంచి బండి భగీరథ్ విడుదల



**హైదరాబాద్ (భారత శక్తి)** పోక్సో కేసులో తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన నేపథ్యంలో బండి భగీరథ్ చర్లపల్లి కేంద్ర కారాగారం నుంచి శుక్రవారం మధ్యాహ్నం విడుదలయ్యారు. హైకోర్టు ఉత్తర్వుల కాపీలు జైలు అధికారులకు అందిన అనంతరం అన్ని న్యాయపరమైన ప్రక్రియలను పూర్తి చేసి ఆయన్ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జైలు వద్దకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్

2లో..

## హరీశ్ రావు కాంగ్రెస్‌లోకి వస్తానంటే పీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం: మహేశ్ గౌడ్



**హైదరాబాద్ (భారత శక్తి)** గాంధీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రతిపక్షాలపై విమర్శల జడివాన కురిపించారు. ముఖ్యంగా బీఆర్ఎస్ నాయకుడు హరీశ్ రావును లక్ష్యంగా చేసుకుని ఘాటు వ్యాఖ్యలు చేశారు.పదేళ్ల అధికారంలో ఉండి కుంగిపోయే ప్రాజెక్టులు కట్టిన మీరు... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి గడువులు విధించడం హాస్యాస్పదమని మహేశ్

2లో..

## వైసీపీ నేతలు వికృత శైలిని ఎంచుకున్నారు


### - వాళ్ల ట్రాప్‌లో పడొద్దు: కేబినెట్ సమావేశంలో చంద్రబాబు



**అమరావతి (భారత శక్తి)**ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో ఈరోజు జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రిమండలి సమావేశంలో సోషల్ మీడియా వేదికగా సాగుతున్న అసత్య ప్రచారాలపై సుదీర్ఘమైన చర్చ జరిగింది. డిజిటల్ వేదికల్లో ప్రభుత్వంపై, కూటమి నేతలపై వస్తున్న అభ్యంతరకర వీడియోలు, పోస్టులపై సమావేశంలో

2లో..

## కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తాన్ని తప్పుబట్టడం సరికాదు: ఈటల



**హైదరాబాద్ (భారత శక్తి)** ప్రజల ప్రయోజనాల విషయంలో తనకు తెలంగాణే మొదటి ప్రాధాన్యమని, ఆ తర్వాతే పార్టీ, వ్యక్తిగత అంశాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. తాను ఎవరో చెప్పినట్లు మాట్లాడే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. సాగునీటి నిర్వహణ, కాళేశ్వరం ప్రాజెక్టు, రైతుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు.ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాలతో తెలంగాణ

2లో..

# విజయవంతమైన రైతు ఆశీర్వాద సభ



- రెండు లక్షల పైచిలుకు రైతులు హాజరు
- 2029లో మరలా తిరిగి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం - సీఎం రేవంత్ రెడ్డి
- 117 అసెంబ్లీ స్థానాలు 20 ఎంపీ స్థానాల్లో తెలంగాణలో కాంగ్రెస్ గెలుస్తుంది - సీఎం రేవంత్ రెడ్డి

**ఖమ్మం బ్యూరో, భారత శక్తి, జూలై 10:** ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం మత్కేపల్లి గ్రామంలో రైతు ఆశీర్వాద సభ శుక్రవారం జరిగింది. రైతు భరోసా నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉప ముఖ్యమంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్క, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బటన్ నొక్కి 9వ రోజు నిధులను వెయ్యి కోట్లు రైతులు ఖాతాలో జమ చేశారు.


2లో..



# 40 ఏళ్ల తర్వాత న్యూజిలాండ్‌లో భారత ప్రధాని

### మోదీకి ఘనస్వాగతం

- మూడు దేశాల పర్యటనలో భాగంగా అక్లాండ్ చేరుకున్న ప్రధాని మోదీ
- దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత అక్కడ పర్యటిస్తున్న భారత ప్రధాని
- ఎయిర్‌పోర్ట్‌లో మోదీకి స్వయంగా స్వాగతం పలికిన ప్రధాని క్రిస్టఫర్ లక్సన్
- వాణిజ్యం, ఆర్థిక సంబంధాలపై ఇరు దేశాల ప్రధానుల మధ్య చర్చలు



**న్యూఢిల్లీ (భారత శక్తి)** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మూడు దేశాల పర్యటనలో భాగంగా ఈరోజు న్యూజిలాండ్‌లో అడుగుపెట్టారు. ఇండోనేషియా, ఆస్ట్రేలియా పర్యటనలను ముగించుకుని ఆయన శుక్రవారం ఆక్లాండ్‌కు చేరుకున్నారు. సుమారు నాలుగు దశాబ్దాల విరామం తర్వాత న్యూజిలాండ్‌లో పర్యటిస్తున్న తొలి భారత ప్రధానిగా మోదీ నిలిచారు.

2లో..



# పారిశ్రామిక హబ్‌గా తెలంగాణ!



- పెట్టుబడులకు దేశంలోనే ప్రథమ స్థానమే లక్ష్యం
- కీలక ప్రాజెక్టుల పురోగతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష
- భారత్ ఫ్యూచర్ సిటీ, టెక్స్‌టైల్ పార్కులపై ప్రత్యేక నిఘా

**భారత శక్తి జులై 10-- హైదరాబాద్** :తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత ప్రాధాన్యత కలిగిన పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని పరిశ్రమల శాఖ అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. రాష్ట్రంలో శరవేగంగా రూపుదిద్దుకుంటున్న కీలక పారిశ్రామిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పురోగతిపై ఆయన శుక్రవారం సచివాలయంలో పరిశ్రమలు, వాణిజ్య శాఖ ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం ద్వారా పారిశ్రామికాభివృద్ధిని మరింత వేగవంతం చేయాలని ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. దీనివల్ల అంతర్జాతీయ స్థాయి పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు, స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు.

### వ్యూహాత్మక ప్రాజెక్టులపై ప్రత్యేక నిఘా

తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న కీలక ప్రాజెక్టుల పురోగతిపై

2లో..

## హనుమాన్‌గఢి మెట్లపై నమాజ్ చేయించినవారే ఇప్పుడు మాట్లాడుతున్నారు

### - యోగి ఆదిత్యనాథ్



రామాలయ విరాళాల చోరీ ఆరోపణల వివాదం కొనసాగుతున్న వేళ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హనుమాన్‌గఢి అంశాన్ని మరోసారి తెరపైకి తీసుకొచ్చారు. అయోధ్య పర్యటన సందర్భంగా రూ.432 కోట్ల విలువైన 217 అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన ఆయన.. అనంతరం జరిగిన సభలో ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు చేశారు. గత ప్రభుత్వాల హయాంలో అయోధ్య నిర్లక్ష్యానికి గురైందని యోగి ఆరోపించారు. ఒకప్పుడు రహదారులు, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కూడా లేవని చెప్పారు. ప్రస్తుతం విశ్వాసం గురించి మాట్లాడుతున్నవారే గతంలో హనుమాన్‌గఢి మెట్లపై

2లో..

## గడువులోగా 'ప్రత్యేక సమగ్ర సవరణ' పూర్తి చేయాలి!

- అధికారులకు భారత ఎన్నికల కమిషన్ సీనియర్ ఉప ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ ఆదేశం
- హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన
- తెలంగాణలో 'ఎస్ఐఆర్ 2026' ప్రక్రియపై ఉన్నతాధికారులతో దృశ్య శ్రవణ సమావేశం




**భారత శక్తి, జూలై 10,హైదరాబాద్** :రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని భారత ఎన్నికల కమిషన్ సీనియర్ ఉప ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ అధికారులను ఆదేశించారు. తెలంగాణలో కొనసాగుతున్న సవరణ ప్రక్రియ పురోగతిపై ఆయన ఢిల్లీ నుంచి ఉన్నతాధికారులతో దృశ్య శ్రవణ సమావేశం (వీడియో కాన్ఫరెన్స్) నిర్వహించారు.ఈ సమీక్షలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారితో పాటు అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఓటరు జాబితా పరిశీలకులు పాల్గొన్నారు.

### గణన పత్రాల నమోదు వేగవంతం చేయాలి

సమావేశంలో పవన్ కుమార్ శర్మ మాట్లాడుతూ..

2లో..

# ప్రభుత్వ విద్యా వ్యవస్థకు ? 'ప్రైవేట్' గ్రహణం!

- కార్పొరేట్ పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఎస్ఆర్పి (SRP) శిక్షణ
- విద్యాశాఖ నిర్ణయంపై వెల్లువెత్తిన నిరసనలు; నాచారం డీపీఎస్ (DPS) వద్ద ఏఐవైఎఫ్ ధర్నా
- మేడ్చల్ జిల్లా విద్యాధికారిని (DEO) సస్పెండ్ చేయాలని డిమాండ్

**హైదరాబాద్, జూలై 10 భారత శక్తి:**రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయాల్సిన ప్రభుత్వ విద్యాశాఖ, అందుకు విరుద్ధంగా ప్రైవేట్ విద్యా వ్యాపారాన్ని ప్రోత్సహించేలా నిర్ణయాలు తీసుకోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మేడ్చల్ జిల్లా నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (DPS) వేదికగా ప్రభుత్వ ఉపాధ్యాయులకు రాష్ట్ర వనరుల వ్యక్తుల (State Resource Persons - SRP) శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం వివాదాస్పదంగా మారింది. ప్రభుత్వ విద్యా వ్యవస్థను కించపరిచే విధంగా ఉన్న ఈ శిక్షణా తరగతులను తక్షణమే రద్దు చేయాలని, ఇందుకు బాధ్యుడైన మేడ్చల్ జిల్లా విద్యాధికారిని (DEO) సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (AIYF) ఆధ్వర్యంలో శుక్రవారం సదరు పాఠశాల

2లో..




# తెలంగాణ మత్స్య రంగానికి ప్రపంచ స్థాయి రెక్కలు!

- కోహెడలో రూ.47.03 కోట్లతో అంతర్జాతీయ హోల్‌సేల్ చేపల మార్కెట్, ఎగుమతుల కేంద్రానికి శంకుస్థాపన
- సముద్ర తీరం లేకపోయినా దేశంలోనే తొలిసారిగా భారీ అంతర్గత కేంద్రం ఏర్పాటు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి భాగస్వామ్యంతో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు
- 5,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి; ముదిరాజుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: మంత్రి వాకిటి శ్రీహరి



**రంగారెడ్డి/కోహెడ, జులై 10 (భారత శక్తి ప్రతినిధి):** తెలంగాణ మత్స్య రంగ చరిత్రలో మరో సువర్ణ అధ్యాయం లిఖించబడింది. రంగారెడ్డి జిల్లా కోహెడలో రూ.47.03 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అంతర్జాతీయ స్థాయి ఎగుమతి ఆధారిత హోల్‌సేల్ (భారీ) చేపల మార్కెట్, ఆధునిక ఎగుమతుల కేంద్రానికి శుక్రవారం శంకుస్థాపన జరిగింది. రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి, శాసనసభ్యుడు మల్ రెడ్డి రంగారెడ్డి, మత్స్య శాఖ సంచాలకులు నిఖిల, పండ్ల మార్కెట్ అధ్యక్షుడు చిలుక మధు తదితరులు ఈ కార్యక్రమానికి హాజరై

2లో..

భారత శక్తి
శనివారం, జులై 11, 2026

# ప్రభుత్వ విద్యా వ్యవస్థకు 'ప్రైవేట్' గ్రహణం!





ముందు ప్లకార్డులతో నిరసన ధర్నా నిర్వహించారు.

### ప్రభుత్వ సంస్థలుండగా ప్రైవేట్ వేదికలెందుకు?

ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో లక్షలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వ పరిధిలోనే ఉన్నత స్థాయి విద్యా సంస్థలు అందుబాటులో ఉన్నాయని గుర్తుచేశారు.

### శాస్త్రీయ వనరుల విస్మరణ:

విద్యా చట్టాలు, జాతీయ విద్యా ప్రణాళికా చట్రం (NCF) నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు నిర్దేశిత అకడమిక్ ప్రమాణాలు కలిగిన సంస్థలు ఉన్నాయి. SCERT (రాష్ట్ర విద్యా పరిశోధన – శిక్షణ మండలి) DIET(జిల్లా విద్యా – శిక్షణ సంస్థ) IASE (ఉన్నత విద్యా అధ్యయన సంస్థ) CTE (ఉపాధ్యాయ విద్యా కళాశాల) ఇలాంటి అధునాతన మౌలిక వసతులు, నిపుణులు కలిగిన ప్రభుత్వ శిక్షణ కేంద్రాలను పూర్తిగా పక్కనబెట్టి, ఒక ప్రైవేట్ పాఠశాలను శిక్షణ వేదికగా ఎంచుకోవడం వెనుక ఉన్న అంతర్యమేమిటని ధర్మేంద్ర ప్రశ్నించారు. ఈ నిర్ణయం ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రభుత్వానికే నమ్మకం లేదనే భావనను సమాజంలో కల్పిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.


### ప్రజా ధనం... కార్పొరేట్ ప్రచారం!

ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు కనీస మౌలిక సదుపాయాల కొరత, ఉపాధ్యాయ ఖాళీలు, నిధుల లేమితో సతమతమవుతున్నాయని నిరసనకారులు పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజల పన్నుల రూపంలో వచ్చిన ప్రభుత్వ నిధులను ప్రభుత్వ సంస్థల బలోపేతానికి ఖర్చు చేయకుండా, ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతిష్ఠను, ప్రచారాన్ని పెంచడానికి వినియోగించడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. జులై 9 నుండి 11 వరకు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమానికి సంబంధించి ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌ను ఏ ప్రమాణాల ప్రాతిపదికన ఎంపిక చేశారు? ప్రభుత్వంతో జరిగిన ఒప్పందాలు, నిధుల వ్యయ వివరాలు ఏమిటి? అనే విషయాలను విద్యాశాఖ వెంటనే బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

### స్పందించకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు

ప్రభుత్వ విద్యను బలహీనపరిచేలా తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు ఉద్ధృతం చేస్తామని ఏఐఎస్ఎఫ్ హెచ్చరించింది. ఈ నిరసన ధర్నాల్లో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గిరిబాబు, శేఖర్, ప్రదీప్, ఏఐఎస్ఎఫ్ (AISF) ఉప్పల్ మండల అధ్యక్షుడు ఎండీ. అజీమ్ పాషా, కార్యదర్శి మహేష్ కుమార్, కార్యవర్గ సభ్యులు అలీ, ఇర్ఫాన్, సమీర్, కిరణ్, ఆశ్రఫ్, ఉమేష్, గణేష్, లోకేష్, ఉదీప్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ మత్స్య రంగానికి ప్రపంచ స్థాయి రెక్కలు!








భూమిపూజ చేశారు.సముద్రతీరం లేని ఒక అంతర్గత రాష్ట్రంలో ఈ తరహా అత్యాధునిక ఎగుమతుల కేంద్రాన్ని ఏర్పాటు చేయడం దేశంలోనే ఇదే తొలిసారి కావడం విశేషం. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మత్స్యకారుల ఆదాయాన్ని పెంచడం, వారికి శాశ్వత ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధుల భాగస్వామ్యంతో ఈ కేంద్రాన్ని నిర్మిస్తున్నారు.

### ముదిరాజుల సంక్షేమం కోసం ప్రాణాలైనా ఇస్తా: మంత్రి వాకిటి శ్రీహరి

ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, మత్స్యకారుల సమగ్ర అభివృద్ధి కోసం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తోందని స్పష్టం చేశారు. "గజకర్ణ, గోకర్ణ విద్యల వంటి కుయుక్తులకు, బెదిరింపులకు ఈ ప్రభుత్వం భయపడదు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా అత్యధిక జనాభా కలిగిన ముదిరాజుల, మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి కోసం పాటుపడతాం. వారి సంక్షేమం కోసం మంత్రి, ఎమ్మెల్యే పదవులే కాదు, చివరికి ప్రాణాలు ఇవ్వడానికైనా సిద్ధం" అని మంత్రి భావోద్వేగ ప్రకటన చేశారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని పేర్కొంటూ, మత్స్యకారుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

### దేశంలోనే నంబర్ వన్‌గా తెలంగాణ

మంచినీటి చేపల ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగుతోంది. గడిచిన 2025 సంవత్సరంలో రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 4.20 శ్రీఘనెష్ట్ర (లక్షల) టన్నుల చేపలు, 15,000 టన్నుల మంచినీటి రొయ్యల ఉత్పత్తి నమోదైంది. కోహెడలో నిర్మించే ఈ అంతర్జాతీయ కేంద్రం అందుబాటులోకి వస్తే.. ఇక్కడి మంచినీటి చేపలకు అంతర్జాతీయ బ్రాండింగ్ లభించనుంది. ఫలితంగా దళారీల వ్యవస్థ నశించి, మత్స్యకారులకు గిట్టుబాటు ధర లభిస్తుంది.

### ప్రాజెక్టు ప్రత్యేకతలు -- ఉపాధి కల్పన

మౌలిక వసతుల కల్పన, ఉపాధి వృద్ధిని లక్ష్యంగా చేసుకుని రూ. 47.03 కోట్ల భారీ అంచనా వ్యయంతో ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును రూపకల్పన చేశారు. ఈ మొత్తం వ్యయంలో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులను సమకూరుస్తూ భాగస్వామ్యం వహించాయి.

### ఆధునిక వసతులు -- సాంకేతికత

ఈ ప్రాజెక్టులో భాగంగా వ్యాపార, వాణిజ్య రంగాలకు అవసరమైన అత్యాధునిక వసతులను ఏర్పాటు చేస్తున్నారు. ఉత్పత్తుల నిల్వ కోసం శీతల గిడ్డంగులు (కోల్డ్ స్టోరేజ్), నాణ్యతను పెంచేందుకు శుద్ధి యూనిట్లు, ప్యాకేజింగ్ కేంద్రాలతో పాటు నిపుణుల మార్గదర్శకత్వం కోసం ప్రత్యేక శిక్షణా కేంద్రాలను నెలకొల్పుతున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కస్టమ్స్ క్లియరెన్స్ సదుపాయాలు కూడా ఒకే చోట లభించడం ఈ ప్రాజెక్టు యొక్క ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది.

### వ్యాపార విస్తరణ -- ఆర్థిక ప్రయోజనాలు

ఈ సదుపాయాల ద్వారా సుమారు 2,000 మంది వ్యాపారులకు తమ వ్యాపారాలను విస్తరించుకోవడానికి, కొత్త వాణిజ్య అవకాశాలను అందుకోవడానికి వీలు కలుగుతుంది.

### ఉపాధి రంగంలో విప్లవాత్మక మార్పులు:

ఆర్థిక వృద్ధితో పాటు స్థానికంగా ఉపాధి కల్పనకు ఈ ప్రాజెక్టు పెద్దపీట వేస్తోంది. ముఖ్యంగా లోడింగ్, అన్‌లోడింగ్ మరియు రవాణా (ట్రాన్స్‌పోర్ట్) రంగాల ద్వారా ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సుమారు 5,000 మందికి పైగా కార్మికులకు, నిరుద్యోగులకు నమ్మకమైన జీవనోపాధి లభించనుంది.మొత్తంగా, ఈ ప్రాజెక్టు అటు ఆధునిక మౌలిక వసతుల కల్పనలోనూ, ఇటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధి, ఉపాధి వృద్ధిలోనూ కీలక పాత్ర పోషించనుంది.ఈ ప్రాజెక్టు కేవలం ఒక చేపల మార్కెట్ మాత్రమే కాకుండా, తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే ఒక భారీ వికాస కేంద్రంగా మారబోతోంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు సహకరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు మత్స్యశాఖ మంత్రి కార్యాలయం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. "తెలంగాణలో ఉత్పత్తి అయ్యే ప్రతి చేపకు ప్రపంచ మార్కెట్ అందించడమే మా సంకల్పం" అని ప్రభుత్వం పేర్కొంది.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు దూస వెంకటేష్, మత్స్య శాఖ అదనపు సంచాలకులు మురళీకృష్ణ, అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, భారీ సంఖ్యలో మత్స్యకారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## విజయవంతమైన రైతు ఆశీర్వాద సభ



ఈ సందర్భంగా ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి మాట్లాడుతూ...... తొమ్మిది రోజుల్లో రైతు భరోసా కింద రైతులకు 9,000 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా రైతులకు రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్, రెండు లక్షల రూపాయలు రైతు రుణమాఫీ, సబ్సిడీపై యంత్రాలు ఇలా అనేక పథకాలు రైతుల కోసం ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఒక రైతులనే కాదు గత పది సంవత్సరాల కాలంలో టిఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని పనులను 36 నెలల కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపించింది అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు, సన్న బియ్యం, మహిళలకు ఉచిత బస్సు, ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 67 వేల పైచిలుకు ఉద్యోగ నియామకాలు చేపట్టడం జరిగిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. 2029 మే లో మరల ఎలక్షన్లు జరుగుతాయని అప్పుడు శాసనసభ స్థానాలు పార్లమెంట్ స్థానాలు పెరుగుతాయి అన్నారు. తెలంగాణలో 181 శాసనసభ స్థానాలు 26 పార్లమెంటు స్థానాలకి ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. 2029 ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం 117 అసెంబ్లీ స్థానాల్లో, 20 పార్లమెంటు స్థానాల్లో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కెసిఆర్, కేటీఆర్, హరీష్ రావు, కవితల మాటలను ప్రజలను నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఖమ్మం ప్రజలు కాంగ్రెస్కు కంచుకోటగా ఉన్నారని ఆ ప్రజల ఆశీర్వాదంతోనే ప్రజా ప్రభుత్వ ఏర్పడిందన్నారు. మరలా మీ ఆశీర్వాదంతోనే 2029లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం దేశానికి రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయడమే లక్ష్యంగా రోజుకు 18 గంటలు పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్, పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యేలు మట్ట రాగమయి దయానంద్, రామచంద్రనాయక్, మురళి నాయక్, రాందాస్ నాయక్, ఖమ్మం ఎంపీ రామ్ సహాయం రఘురాం రెడ్డి వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక హబ్‌గా తెలంగాణ!

**ప్రధాన కార్యదర్శి సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా:** భారత్ ఫ్యూచర్ సిటీ (భవిష్యత్ నగరం),జహీరాబాద్ పారిశ్రామిక నగరం,కాకతీయ మెగా వస్త్ర పరిశ్రమల పార్క్ (టెక్స్‌టైల్ పార్క్),వంటి ప్రతిష్టాత్మక వ్యూహాత్మక ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాజెక్టుల అభివృద్ధి దశలు, పెట్టుబడి అవకాశాలు, పనుల పూర్తికి నిర్దేశించుకున్న గడువులపై టీజీఐఐసీ నిర్వాహక సంచాలకులు (మేనేజింగ్ డైరెక్టర్) శశాంక ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శికి సమగ్ర నివేదికను సమర్పించారు.

### శాఖల సమన్వయంతోనే లక్ష్య సాధన

ప్రభుత్వం నిర్దేశించిన పారిశ్రామిక లక్ష్యాలను చేరుకోవడానికి అధికారులు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో (యాక్షన్ ప్లాన్) ముందుకు సాగాలని సంజయ్ జాజు స్పష్టం చేశారు. "రాష్ట్రంలో కొనసాగుతున్న పారిశ్రామిక ప్రాజెక్టుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలి. పనుల్లో ఎదురయ్యే ఆటంకాలను ముందే గుర్తించి, వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో వాటిని త్వరితగతిన పరిష్కరించాలి."

### సంజయ్ జాజు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

భారత్ ఫ్యూచర్ సిటీ, జహీరాబాద్ పారిశ్రామిక నగరం వంటి ప్రాజెక్టులకు తెలంగాణ పారిశ్రామిక రంగాన్నే పూర్తిగా మార్చేసే (రూపాంతరం చెందించే) శక్తి ఉందని, ఇవి ప్రాంతీయ సమతుల్య అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

### సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

అత్యంత కీలకమైన ఈ పారిశ్రామిక సమీక్షా సమావేశంలో పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, చేనేత-వస్త్ర శాఖ ప్రత్యేక కార్యదర్శి కాత్యాయనీ దేవి, 'ఇన్వెస్ట్ తెలంగాణ' ముఖ్య నిర్వహణాధికారి (సీఈఓ) అజిత్ రెడ్డి, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక, పరిశ్రమల శాఖ సంచాలకులు (డైరెక్టర్) నిఖిల్ చక్రవర్తితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## హనుమాన్‌గఢి మెట్లపై నమాజ్ చేయించినవారే ఇప్పుడు మాట్లాడుతున్నారు

నమాజ్ చేయించారని విమర్శించారు. పరోక్షంగా రామమందిర విరాళాల చోరీని ప్రశ్నిస్తున్నవారిపై విమర్శలు గుప్పించారు. "జామా మసీదులో హనుమాన్ చాలీసా చదవనిస్తారా? అలా కాకపోతే హనుమాన్‌గఢి మెట్లపై నమాజ్ జరగడానికి ఎందుకు అనుమతించారు? దానికి బాధ్యులు ఎవరు?" అని ప్రశ్నించారు.తమ ప్రభుత్వం అయోధ్యను పరిశుభ్రమైన, అందమైన నగరంగా తీర్చిదిద్దిందని యోగి తెలిపారు. సరయూ నది తీరంలో ఘనంగా హారతి, రామ్‌కీ పైడీ అభివృద్ధి వంటి పనులతో అయోధ్యకు కొత్త గుర్తింపు వచ్చిందన్నారు. స్పష్టమైన విధానాలు, రాజకీయ సంకల్పం ఉంటే అసాధ్యమేమీ ఉండదని పేర్కొన్నారు. అయోధ్యలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణాన్ని గతంలో సమాజ్‌వాదీ పార్టీ వ్యతిరేకించిందని యోగి ఆరోపించారు. ప్రస్తుతం మహర్షి వాల్మీకి పేరుతో ఉన్న ఆ విమానాశ్రయం దేశ, విదేశాలతో అయోధ్యను అనుసంధానిస్తోందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజన్‌తో అయోధ్యను దేశంలోని ఎంపిక చేసిన సోలార్ నగరాల్లో ఒకటిగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. శ్రీరాముడి తమ్ముడు భరతుడి గౌరవార్థం భదర్సా ప్రాంతానికి 'భారత్‌పూర్-భరత్‌కుండ్'గా పేరు మారుస్తామని యోగి ప్రకటించారు. ప్రపంచంలో ఎక్కడైనా అయోధ్య పేరు వినగానే భారతీయుల ముఖాల్లో ఆనందం కనిపిస్తోందని, 500 ఏళ్లుగా సాధ్యం కానిది ఇప్పుడు సాకారమైందని వ్యాఖ్యానించారు.

# చర్లపల్లి జైలు నుంచి బండి భగీరథ్ విడుదల

ఎంపీ బండి సంజయ్ కుమార్‌తో పాటు కుటుంబ సభ్యులు, సన్నిహితులు చేరుకుని భగీరథ్‌కు స్వాగతం పలికారు. బెయిల్ మంజూరు చేసిన సందర్భంగా తెలంగాణ హైకోర్టు పలు కీలక షరతులు విధించింది. దర్యాప్తు అధికారులకు పూర్తిగా సహకరించాలని, సాక్షులను లేదా ఫిర్యాదుదారులను ఎలాంటి ప్రభావానికి గురిచేయరాదని స్పష్టం చేసింది. అలాగే విచారణకు అవసరమైనప్పుడు దర్యాప్తు అధికారుల ఎదుట హాజరుకావాలని ఆదేశించింది.

## హరీశ్ రావు కాంగ్రెస్‌లోకి వస్తానంటే పీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం: మహేశ్ గౌడ్

గౌడ్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మార్క్ అభివృద్ధి చూసి ఆయనకు మిట్టమధ్యాహ్నమే చుక్కలు కనిపిస్తున్నాయన్నారు. హరీశ్ రావు ఒకవేళ కాంగ్రెస్‌లోకి వస్తానంటే... తమ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీలో (పీఏసీ) చర్చించి నిర్ణయం తీసుకుంటామని వ్యాఖ్యానించారు. ఒక ప్రాంతీయ పార్టీ అయిన బీఆర్ఎస్ ఖాతాలో రూ.1,400 కోట్లు ఎలా జమ అయ్యాయో చెప్పాలని నిలదీశారు.నాడు బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఉండి నీళ్ల దోపిడీని ప్రశ్నించని ప్రస్తుత బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్... ఇప్పుడు అదే బీఆర్ఎస్ పార్టీకి వత్తాసు పలుకుతున్నట్టుగా కనిపిస్తోందని అన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ హామీ ఏమైందని ప్రశ్నించారు. గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలు కల్పించిందో చెప్పాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్‌లో క్రమశిక్షణ అందరికీ ఒకటేనని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. కడియం శ్రీహరి, కొండా సురేఖ వివాదాలపై సచిన్ సావంత్, జగ్గారెడ్డిలతో కూడిన కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయన్నారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ప్రతినిధులతో చర్చించి ఈ నెల 15న కొలిక్కి తెస్తామని కీలక అప్‌డేట్ ఇచ్చారు.

# వైసీపీ నేతలు వికృత శైలిని ఎంచుకున్నారు

మంత్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.భావ ప్రకటన స్వేచ్ఛను గౌరవిస్తూనే.. హద్దులు మీరి అసత్యాలు వక్రీకరిస్తే మాత్రం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను మంత్రిమండలి ఆదేశించింది. సోషల్ మీడియా సైబర్ నేరాల నియంత్రణకు వెంటనే ఒక ప్రత్యేక 'టాస్క్ ఫోర్స్' ఏర్పాటు చేయాలని, అవసరమైతే నిపుణులను బయటి నుంచి తీసుకోవాలని సూచించింది. అంతేకాకుండా, ఈ కేసులలో ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కొత్తగా పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించుకోవాలని స్పష్టం చేసింది. ఈ కార్యాచరణపై ఇప్పటికే ఉన్న కేబినెట్ సబ్ కమిటీలోనూ చర్చించనున్నారు.రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే వైసీపీ నేతలు ఈ సరికొత్త వికృత ప్రచార శైలిని ఎంచుకున్నారని ఈ సందర్భంగా చంద్రబాబు మంత్రులకు వివరించారు. "వారు కావాలనే ఎమ్మెల్యేలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వారి ట్రాప్‌లో పడొద్దు. సంయమనం పాటించండి" అని సూచించారు.అనంతపురం సహా పలు జిల్లాల్లో ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలను ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. ప్రతికూల ప్రచారాలను తిప్పికొడుతూ... ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనదేనన్నారు. జిల్లాల పర్యటనలకు వెళ్లే ఇన్‌ఛార్జ్ మంత్రులు స్థానిక ఎమ్మెల్యేలతో పూర్తిస్థాయిలో సమన్వయం చేసుకోవాలని, రెవెన్యూతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న ఇతర క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఆదేశించారు.

# 40 ఏళ్ల తర్వాత న్యూజిలాండ్‌లో భారత ప్రధాని

ఆక్లాండ్ విమానాశ్రయంలో న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టఫర్ లక్సన్ స్వయంగా మోదీకి సాదర స్వాగతం పలికారు. రెండు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో ప్రధాని మోదీ, లక్సన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై ఈ భేటీలో ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఇటీవలే పురోగతి సాధించిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చర్చల నేపథ్యంలో ఈ పర్యటనకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ పర్యటనలో భాగంగా మోదీ ప్రవాస భారతీయులను ఉద్దేశించి కూడా ప్రసంగించనున్నారు. భారత్ 'యాక్ట్ ఈస్ట్ పాలసీ', 'మహాసాగర్' విజన్‌ను బలోపేతం చేయడంతో పాటు, స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్ ప్రాంతం పట్ల తమ నిబద్ధతను ఈ పర్యటన పునరుద్ఘాటిస్తుందని మోదీ తన పర్యటనకు ముందు ఒక ప్రకటనలో తెలిపారు. 2025 మార్చిలో లక్సన్ జరిపిన భారత పర్యటనతో వచ్చిన సానుకూలతను ఈ పర్యటన మరింత ముందుకు తీసుకెళుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆస్ట్రేలియా పర్యటనలో ప్రధాని మోదీ రక్షణ, సముద్ర సహకారాన్ని పెంపొందించుకోవడంతో పాటు, భారత్‌కు యురేనియం సరఫరాకు వీలు కల్పించే కీలకమైన పౌర అణు ఇంధన ఒప్పందం కుదుర్చుకున్నారు. అంతకుముందు ఇండోనేషియా పర్యటనలో కీలక ఖనిజాలు, సముద్ర భద్రత వంటి అంశాలపై పలు కీలక ఒప్పందాలు చేసుకున్నారు.

# అరెస్టు చేసినా, చంపేసినా సిద్ధమే..

మరణశిక్షను ఎదుర్కొంటున్న మరో సీనియర్ నాయకుడు, మాజీ హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్ కూడా ఆమెతో పాటు బంగ్లాదేశ్‌కు వెళ్లే వారిలో ఉన్నారు. 2024లో విద్యార్థులు, సామాన్య ప్రజలు చేపట్టిన భారీ నిరసనల కారణంగా షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన సంగతి విదితమే. సుమారు రెండు దశాబ్దాల పాటు ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆమె, 2024 ఆగస్టులో ప్రాణరక్షణ కోసం భారత్‌కు చేరుకుని రాజకీయ ఆశ్రయం పొందారు. నిరసనల అణిచివేతలో చోటుచేసుకున్న హింసాకాండ, మానవత్వానికి వ్యతిరేకంగా జరిగిన నేరాల ఆరోపణల నేపథ్యంలో బంగ్లాదేశ్‌లోని ప్రత్యేక ట్రైబ్యునల్ 2025 నవంబర్‌లో ఆమెకు మరణశిక్ష విధించింది. ఆమె పార్టీ అయిన అవామీ లీగ్‌పై కూడా నిషేధం విధించారు. అయితే, తనపై నమోదైన కేసులన్నీ రాజకీయ ప్రేరేపితమైనవని హసీనా కొట్టిపారేశారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తాన్ని తప్పుబట్టడం సరికాదు: ఈటల

ప్రాజెక్టుల్లోకి నీరు వస్తున్నప్పటికీ ప్రభుత్వం మోటార్లు ఆన్ చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఈటల ఆరోపించారు. వర్షాకాలంలోనూ సాగునీరు అందక రైతులు కష్టాలు పడుతున్నారని, ముఖ్యంగా ఎస్ఆర్ఎస్పీ కాల్వల కింద బోర్లు, బావులు లేకుండా వ్యవసాయం చేయడం సాధ్యం కాదని చెప్పారు. తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, ఆత్మగౌరవం కోసమే జరిగిందని ఈటల గుర్తుచేశారు. రాజకీయాలు, సిద్ధాంతాలు వేరైనా మూలాలను మరచిపోవద్దన్నారు. కాళేశ్వరం కంటే ముందే వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జలయజ్ఞం ద్వారా ప్రాణహిత జలాలను తీసుకురావాలనే ప్రణాళిక రూపొందిందని, శ్రీపాద ఎల్లంపల్లి, మిడ్ మానేరు వంటి ప్రాజెక్టులకు అప్పుడే శ్రీకారం చుట్టారని వివరించారు. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టును అభివృద్ధి చేసి ఎల్లంపల్లికి నీటిని తరలించే వ్యవస్థ ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రస్తుతం మిడ్ మానేరు ప్రాజెక్టులో ఉన్న 29 టీఎంసీల నీరు కూడా ఆ ప్రాజెక్టుల ద్వారానే వచ్చిందన్నారు. కాళేశ్వరం వల్లే హుజూరాబాద్‌తో పాటు కరీంనగర్, వరంగల్, నల్గొండ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో రెండు పంటలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కమీషన్లు, డిజైన్ మార్పులపై తాను మాట్లాడడం లేదని, కానీ మొత్తం ప్రాజెక్టునే తప్పుపట్టడం సరికాదని కాంగ్రెస్ నేతలపై మండిపడ్డారు. ప్రాజెక్టు పరిధిలోని దెబ్బతిన్న నిర్మాణాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, లేకపోతే రాష్ట్రం తీవ్ర కరవును ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## గడువులోగా 'ప్రత్యేక సమగ్ర సవరణ'

# పూర్తి చేయాలి!

. ఓటర్ల గణన పత్రాల (ఎన్యూమరేషన్ ఫారాల) పంపిణీ, వాటి సేకరణ, కంప్యూటరీకరణ (డిజిటలైజేషన్) ప్రక్రియలను మరింత వేగవంతం చేసి సకాలంలో ముగించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా జనాభా సాంద్రత ఎక్కువగా ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో కంప్యూటరీకరణ నెమ్మదిగా సాగడంపై ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయా జిల్లాల్లో అదనపు సిబ్బందిని నియమించుకుని అయినా సరే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

### ఉత్తమ విధానాలను అందిపుచ్చుకోండి:

ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న జిల్లాల అధికారులను కమిషన్ ఈ సందర్భంగా అభినందించింది. వారు క్షేత్రస్థాయిలో అనుసరిస్తున్న ఉత్తమ వ్యూహాలను, పద్ధతులను మిగిలిన జిల్లాల ఎన్నికల అధికారులు కూడా అధ్యయనం చేసి తమ ప్రాంతాల్లో అమలు చేయాలని సూచించింది.

### ఢిల్లీ నుంచి రోజువారీ నిఘా!

రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న గణన పత్రాల పంపిణీ, సేకరణ, కంప్యూటరీకరణ ప్రక్రియలను రోజువారీగా నిర్దేశించుకున్న లక్ష్యాల ప్రకారం పర్యవేక్షించాలని తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారిని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. 'ఎస్ఐఆర్ 2026' ప్రక్రియను ఎలాంటి తప్పులు లేకుండా, నిర్ణీత సమయంలోగా విజయవంతంగా పూర్తి చేయడంపై కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి సారించిందని, ఇందులో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని పవన్ కుమార్ శర్మ స్పష్టం చేశారు.

# సంపాదకీయం

భారత శక్తి
VOICE OF INDIAN

## జలవివాదాలకు చెక్

దశాబ్దాలుగా కొనసాగుతున్న అంతర్రాష్ట్ర జల వివాదాలకు కేంద్ర ప్రభుత్వం పరిష్కార మార్గం చూపుతోంది. యమునా, నర్మదా, సోన్, కృష్ణా జలాల పంపిణీపై రాష్ట్రాల మధ్య అలాగే, కావేరి వివాదంపై కూడా చర్చలు కొనసాగుతున్నాయి. ఈ చర్యలతో సాగునీటి ప్రాజెక్టులు వేగవంతం కావడంతో పాటు రైతులకు నీటి భద్రత, ప్రజలకు తాగునీటి సౌకర్యం మెరుగుపడనుంది. కేంద్ర ప్రభుత్వం చొరవతో 'నీటి యుద్ధాలు' ఆగి, సాగునీటి ప్రాజెక్టులు వేగవంతం కాబోతున్నాయి. అపారమైన జల వనరులున్నా.. కేవలం వివాదాల వల్ల ఆగిపోయిన ప్రాజెక్టులకు ఈ ఒప్పందాలు కొత్త ఊపిరి పోస్తున్నాయి. దేశ అభివృద్ధిని కుంటుపరుస్తున్న కీలక అంశాల్లో అంతర్రాష్ట్ర జల వివాదాలు ఒకటి. దశాబ్దాల పాటు సాగిన న్యాయ పోరాటాల వల్ల రైతులు, సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే ప్రధాని మోదీ సూచనల మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ రంగంలోకి దిగి రాష్ట్రాల ముఖ్యమంత్రులతో చర్చలు జరపడంతో పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం దొరుకుతోంది.యమునా జలాల ఒప్పందం : దాదాపు 30 ఏళ్ల నాటి హరియాణా-రాజస్థాన్ యమునా జల వివాదం పరిష్కారమైంది. ఈ ఒప్పందంతో రాజస్థాన్‌లోని షెకావతి, హరియాణా సరిహద్దు ప్రాంతాలకు అదనపు నీటి లబ్ధి చేకూరుతుంది.నర్మదా ప్రాజెక్టుల పరిష్కారం : గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల మధ్య సర్దార్ సరోవర్, ఇందిరా సాగర్ ప్రాజెక్టుల పునరావాసం, ఆర్థిక అంశాలపై 'వన్-టైమ్ సెటిల్‌మెంట్' పూర్తయింది.కిషా బహుళార్థసాధక ప్రాజెక్టు హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హరియాణా రాష్ట్రాల మధ్య కీలక భేటీ జరగనుంది. టోన్స్ నదిపై కిషా ఆనకట్ట నిర్మాణంతో లక్షలాది మందికి తాగునీరు, విద్యుత్ అందుబాటులోకి రానున్నాయి. బీహార్, జార్ఖండ్ మధ్య సోన్ నది జలాల పంపిణీకి అంగీకారం కుదిరింది. ఒప్పందం ప్రకారం.. నీటిలో జార్ఖండ్‌కు 2 ఓంఈ, బీహార్‌కు 5.75 ఓంఈ నీరు లభిస్తుంది. దీనివల్ల ఇంద్రపురి జలాశయ ప్రాజెక్టు మార్గం సుగమమైంది.కృష్ణా జలాలు: కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీపై కూడా సానుకూల సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ మధ్యనే కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులను కేంద్రం ఒక వేదికపైకి తీసుకొచ్చింది.తమిళనాడు, కర్ణాటక మధ్య దశాబ్దాలుగా రగులుతున్న 'కావేరి జల వివాదం' ఇప్పటికీ అత్యంత సున్నితంగా ఉంది. అయితే, ఈ అంశాన్ని కూడా చర్చల ద్వారా పరిష్కరించేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ఇరు రాష్ట్రాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, శాస్త్రీయమైన పరిష్కారాన్ని కనుగొనేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. కేంద్రం చెబుతున్న లెక్కల ప్రకారం.. ఈ పరిష్కారాల వల్ల ప్రత్యక్షంగా రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు, రాష్ట్రాలకు విద్యుత్ అందుతాయి. రాష్ట్రాల మధ్య జలవివాదాలకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా కీలక అడుగులు పడుతున్నాయి. ఇప్పటిదాకా ఒకటిగా ఉన్న గోదావరి-కావేరీ అనుసంధాన ప్రాజెక్టును రెండు భాగాలుగా చేపట్టాలని కేంద్రం ప్రతిపాదించింది. అందులో ఒక భాగం సమ్మక్క సాగర్ నుంచి నాగార్జున సాగర్ దాకా కాగా.. రెండోది పోలవరం నుంచి చేపట్టేది. ఈ ప్రక్రియలో భాగంగా రెండు కీలక అడుగులు పడే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఒకటి.. 88 టీఎంసీలతో తెలంగాణ చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఏపీ అంగీకారం తెలపాలి. దానికి బదులుగా 167 టీఎంసీలతో పోలవరం నుంచి గోదావరి-కావేరీ అనుసంధానానికి తెలంగాణ సమ్మతి తెలియజేయాలని కేంద్రం షరతు పెట్టింది. ఇందుకు రెండు రాష్ట్రాలూ సూత్రప్రాయ ఆమోదం తెలిపినట్లు సమాచారం. ఇవి కార్యరూపం దాల్చితే తెలుగు రాష్ట్రాలకు జల వివాదాల విషయంలో శాశ్వతంగా మేలు జరుగుతుందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతుంది. ప్రస్తుతం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డీపీఆర్ కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) వద్ద పెండింగ్‌లో ఉంది. 90 టీఎంసీలతో డీపీఆర్ సమర్పించగా.. నీటి కేటాయింపులపై సీడబ్ల్యూసీ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ 90 టీఎంసీల్లో 45 టీఎంసీలు పోలవరం నుంచి వచ్చే వాటా కాగా.. మరో 45 టీఎంసీలు తెలంగాణలో మైనర్ ఇరిగేషన్‌లో చేసిన పొదుపు ఖాతాలోనివి. ఈ పథకానికి అనుమతివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం చాలాకాలంగా విజ్ఞప్తి చేస్తున్న సంగతి తెలిసిందే. సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ ఇటీవలే కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి.. జలవివాదాల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. తెలంగాణ విజ్ఞప్తితోనే పాలమూరు-రంగారెడ్డికి ఆమోదం తెలుపాలని ఏపీ సీఎం చంద్రబాబును సీఆర్ పాటిల్ ప్రత్యేకంగా కోరారు. పాలమూరుకు ఆమోదం తెలుపడానికి చంద్రబాబు అంగీకారం వ్యక్తం చేశారని.. అదే సమయంలో పోలవరం నుంచి గోదావరి-కావేరీ అనుసంధానానికి తెలంగాణ సమ్మతి తెలిపేలా చూడాలని ఆయన కోరారని తెలుస్తోంది. పోలవరం ప్రాజెక్టుకు అనుమతి లభిస్తే కృష్ణా డెల్టాకు తరలించే 80 టీఎంసీలకు బదులుగా సాగర్ ఎగువన ఉన్న రాష్ట్రాలు 80 టీఎంసీలు వాడుకోవాలని బచావత్ ట్రైబ్యునల్ తీర్పు ఉంది.ఆ తీర్పు మేరకు దక్కే 45 టీఎంసీలతో పాటు గోదావరి-కావేరి అనుసంధానంలో తెలంగాణకు వాటాగా ఇవ్వదలుచుకున్న 43 టీఎంసీలు కలుపుకొని 88 టీఎంసీలతో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు ఏపీ ఆమోదం తెలపాలి. అలాగే, సమ్మక్కసాగర్‌లో తెలంగాణ తన వాటా 47 టీఎంసీలు వదులుకోవాలి. గోదావరి-కావేరీ అనుసంధానంలో ఏపీ వాటాగా లభించే 45 టీఎంసీలు, కర్ణాటక వాటా 16 టీఎంసీలు(దీనికి బదులుగా బెడ్తి- హిరేవడ్డెటి లింక్ కింద 16టీఎంసీలు కర్ణాటకకు ఇవ్వడం), గోదావరిలో ఏ రాష్ట్రమూ వినియోగించుకొని వాటా కింద 15 టీఎంసీలు, జీసీ లింక్‌లో తమిళనాడు వాటా 44 టీఎంసీలు కలుపుకొని 167 టీఎంసీలతో పోలవరం నుంచి గోదావరి-కావేరి అనుసంధానం చేపట్టడానికి తెలంగాణ గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలి. నీటి లభ్యత ఉన్నచోటి నుంచి జలాలు తీసుకెళ్లి కరువు పీడిత ప్రాంతాలకు నీటిని అందించాలనే లక్ష్యంతో 1980లో నేషనల్ పర్‌స్పెక్టివ్ ప్లాన్‌లో భాగంగా హిమాయలన్ కాంపోనెంట్ నుంచి పెనిన్సులర్ కాంపోనెంట్‌కు నీటిని తరలించే ప్రతిపాదన వచ్చింది. ఇదే క్రమంలో మహానది(ఒడిశా)-గోదావరి అనుసంధానం కూడా తెరమీదికి తెచ్చారు.

ఈ పథకంలో కాటన్ బ్యారేజీ(ధవళేశ్వరం) ఎగువన 230 టీఎంసీలు తెచ్చి వేయాలనేది ప్రతిపాదన. ఇదే క్రమంలో గోదావరిలో 500 టీఎంసీల మిగులు జలాలకు సంబంధించి.. ఇచ్చంపల్లి నుంచి నాగార్జున సాగర్‌తో పాటు మరో నాలుగు అనుసంధాన ప్రతిపాదనలు తెరమీదికి వచ్చాయి. 2014లో రాష్ట్ర అవతవరణ అనంతరం తెలుగు రాష్ట్రాలు గోదావరిలో ఒక్క చుక్కకూడా మిగులు జలాలు లేవని వాదించడంతో ఈ ప్రతిపాదనలన్నీ పక్కనపెట్టారు. ఆ తర్వాత గోదావరిలో ఛత్తీస్‌గఢ్ మరో 50 ఏళ్లయినా వాడుకోని వాటా(148 టీఎంసీల)తో గోదావరి-కావేరీ అనుసంధానం తొలిదశను ప్రతిపాదించారు. దీనికి ఏపీ తప్ప అన్ని రాష్ట్రాలూ సూత్రప్రాయంగా అంగీకరించాయి. ఇచ్చంపల్లికి బదులుగా పోలవరం నుంచే గోదావరి-కావేరీ అనుసంధానం చేపట్టాలని ఏపీ బలంగా పట్టుబడుతున్న సంగతి తెలిసిందే.. తాజాగా పోలవరం-బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ ప్రాజెక్టును ఏపీ తెరమీదికి తెచ్చింది. దీనికి కొనసాగింపుగానే గోదావరి-కావేరీ అనుసంధానాన్ని రెండు భాగాలుగా ప్రతిపాదించారు. ఒకటి.. సమ్మక్కసాగర్(తుపాకులగూడెం) నుంచి సాగర్ దాకా 43 టీఎంసీల తరలింపు. ఈ 43 టీఎంసీలూ సాగర్ ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి పాలమూరు-రంగారెడ్డిలో వాడుకునే వెసులుబాటు ఇవ్వనున్నారు. రెండోది పోలవరం నుంచి చేపట్టే గోదావరి-కావేరి అనుసంధానం. అందులో భాగంగా ఉమ్మడి గుంటూరుజిల్లాలోని బొల్లాపల్లిలో రిజర్వాయర్ నిర్మించి, అక్కడి నుంచి టన్నెల్స్ తవ్వడం ద్వారా నీటిని తీసుకెళ్లి.. బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌లో వేయనున్నారు. ఆ తర్వాత నీటిని సోమశిలకు తరలించి, అక్కడి నుంచి కావేరి గ్రాండ్ ఆనికట్‌కు తమిళనాడు వాటా కింద 44 టీఎంసీలు ఇవ్వనున్నారు.

పోలవరం నుంచి వరద జలాల ఆధారంగా గోదావరి-కావేరి అనుసంధానం చేపట్టాలని గత కొంతకాలంగా ఏపీ పట్టుబడుతున్న విషయం విదితమే. తాజా ప్రతిపాదనలు కార్యరూపం దాల్చితే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు పోలవరం నుంచి గోదావరి-కావేరీ అనుసంధానంలో తరలించే ప్రాజెక్టులను నికర జలాలతోనే చేపట్టనున్నారు. అదే జరిగితే రెండు ప్రాజెక్టుల డీపీఆర్‌లకు ఆమోదం లభించడమే కాకుండా కేంద్ర నిధులు కూడా విడుదల కానున్నాయి.

# పచ్చని పొలాల్లో 'ఇథనాల్' చిచ్చు.. రావిపహాడ్ రైతుల గుండెల్లో గుబులు



సూర్యాపేట, భారత శక్తి జిల్లా ప్రతినిధి, జూలై 10: అభివృద్ధి పేరుతో వినాశనం బయోఫ్యూయల్ ఫ్యాక్టరీతో చుట్టుపక్కల గ్రామాలకు పొంచి ఉన్న పర్యావరణ ముప్పు!

సూర్యాపేట జిల్లా, మోతే మండలం రావిపహాడ్ (సర్వే నంబర్లు: 128, 130, 132) గ్రామంలో 'చీవీఖ బయోఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్' ఏర్పాటు చేయబోతున్న భారీ ఇథనాల్ ప్లాంట్ ఇప్పుడు స్థానికుల పాలిట శాపంగా మారనుందా? అంటే అవుననే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పాడైపోయిన బియ్యం, మొక్కజొన్నతో రోజుకు 1.5 లక్షల లీటర్ల ఇథనాల్ (బయోఫ్యూయల్) తయారు చేసే ఈ ఫ్యాక్టరీ వల్ల దేశానికి మేలు జరిగినా, స్థానికంగా మాత్రం తీవ్ర నష్టాలు తప్పవని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు.

### - వ్యవసాయానికి ఎసరు..

### జలగండం:

ఈ ఫ్యాక్టరీ నడవాలంటే ప్రతిరోజూ లక్షల లీటర్ల నీరు అవసరం. పక్కనే ఉన్న పాలేరు నది నుంచి పైపులైన్ ద్వారా నీరు తెస్తామని యాజమాన్యం చెబుతున్నా, వేసవిలో నది ఎండిపోతే ఫ్యాక్టరీ కన్ను కచ్చితంగా భూగర్భ జలాల మీదే పడుతుంది. భారీ మోటార్లతో నీటిని తోడేస్తే, 90 శాతం వ్యవసాయంపై ఆధారపడ్డ చుట్టుపక్కల 4-5 గ్రామాల రైతుల బోర్లన్నీ వట్టిపోవడం ఖాయం.

### - కాలుష్య కోరల్లో గ్రామాలు:

ధాన్యాన్ని పులియబెట్టడం (ఫీవతీఎవతీఖఊశీఅ) ద్వారా వచ్చే కుళ్ళిన కంపు వాసన కిలోమీటర్ల మేర వ్యాపించి ప్రజల ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుంది. ఇక తయారీ తర్వాత రోజుకు దాదాపు 10 లక్షల లీటర్ల అత్యంత ప్రమాదకరమైన, ఆమ్ల లక్షణాలున్న మురుగు నీరు (స్పెంట వాష్) వస్తుంది.

### - యాజమాన్యం మాటలు - ఆచరణలో లోసుగులు:

ఈ మురుగునీటిని అత్యాధునిక చైనా మిషన్ గ్రాణ - జీరో లిక్విడ్ డిశ్చార్జ్) ద్వారా శుద్ధి చేస్తామని కంపెనీ చెబుతోంది. కానీ, దాన్ని ప్రతిరోజూ నడపడానికి కరెంటు, బొగ్గు కోసం లక్షల్లో ఖర్చవుతుంది. ఈ నిర్వహణ ఖర్చును తప్పించుకోవడానికి చాలా ఫ్యాక్టరీలు రాత్రికి రాత్రే ఆ వ్యర్థాలను దొంగచాటుగా పొలాల్లోకి, కాలువల్లోకి వదిలేస్తుంటాయి. అదే జరిగితే ఇక్కడి సారవంతమైన భూములన్నీ పనికిరాకుండా పోతాయి. ముడిసరుకు తెచ్చే వందలాది భారీ లారీల వల్ల పల్లెటూరి రోడ్లు ధ్వంసమై, దుమ్ముతో పంటలు నాశనమవుతాయి.

### - మేల్కోవాల్సిన సమయం ఆసన్నమైంది!

అభివృద్ధిని ఎవరూ వ్యతిరేకించరు, కానీ అది రైతుల పొట్టగొట్టి చేయకూడదు. యాజమాన్యం చెప్పే మాయమాటలను గుడ్డిగా నమ్మకుండా ప్రజలు అప్రమత్తం కావాలి.

కాలుష్య నియంత్రణ మండలి (గ్రాజదీ) 'ప్రజాభిప్రాయ సేకరణ' జరిపినప్పుడు అధికారులను సూటిగా నిలదీయాలి. గ్రామ సభల్లో యాజమాన్యం చేత రాతపూర్వక అగ్రిమెంట్లు (బాండ్) తీసుకోవాలి. ఫ్యాక్టరీ కాలుష్యంపై నిరంతరం నిఘా ఉంచడానికి గ్రామ యువకులు, రైతులతో ఒక 'ప్రజా కమిటీ'ని ఏర్పాటు చేసుకోవాలి. భూమి, నీరు కలుషితమై ప్రాణాలు పోయాక పరిహారం అడగడం కంటే, ముందే మేల్కొని మన భవిష్యత్తును కాపాడుకోవడం ఉత్తమం!

# వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ విజయవంతం

## - ఏ ఐ ఎస్ ఎఫ్ , పి డి ఎస్ యు,ఏ ఐ వై ఎఫ్






**మలక్పేట్ జులై 10 భారత శక్తి** తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త బందు పిలుపులో భాగంగా జూలై 10న హైదరాబాద్ జిల్లా మలక్పేట్ నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతంగా సాగిందని బిఏ ఐ ఎస్ ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు అనిల్ కుమార్,చైతన్య యాదవ్ , పి డి ఎస్ యు జిల్లా కార్యదర్శి నవీన్ ఏఐవైఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు, నెర్లకంటి శ్రీకాంత్ బాలకృష్ణ తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే విధానాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, ఎంఈఓలు, డీఈఓలు, లెక్చరర్లు తదితర విద్యాశాఖ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ విద్యకు తగిన నిధులు కేటాయించి, మధ్యాహ్న భోజన పథకాన్ని స్థానిక మహిళా సంఘాల ద్వారా సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టి ఫీజులను నియంత్రించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. విద్యార్థుల హక్కులను కాపాడే చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ఈ బంద్ ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొంటూ, మలక్పేట్ నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ, మరియు ప్రైవేట్ పాఠశాలలు , కళాశాలాలు బంద్ విజయవంతం జరిగింది. విద్యార్థులకు తల్లిదండ్రులకు వామపక్ష విద్యార్థి సంఘాలు బిఏ ఐ ఎస్ ఎఫ్, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఏ ఐ ఎస్ ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి జోసెఫ్ భాను ఉపాధ్యక్షులు అరుణ్ కుమార్ జిల్లా నాయకులు సుమన్ (ఓ యు ) రామ్ చరణ్,కరుణాకర్,కిషోర్, నాగరాజు పి డి ఎస్ యు ,, తదితరులు పాల్గొన్నారు

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

## - జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్


**జోగులాంబ** ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను జిల్లాలో వేగవంతం చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శుక్రవారం గద్వాల పట్టణంలోని 30వ వార్డు, రాతి బురుజు ప్రాంతం, పోలింగ్ స్టేషన్ నెంబర్ 260లో బిఎల్వోలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బూత్ స్థాయిలో ఫారాల పంపిణీ, స్వీకరణ, డేటా ఎంట్రీ పురోగతిని సమీక్షించారు. ఫారాలు పంపిణీ చేయడం మాత్రమే కాకుండా, పూర్తిగా పూరించిన దరఖాస్తులను తిరిగి సేకరించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఒక్కో ఫారం డేటా ఎంట్రీకి ఎక్కువ సమయం పడుతున్న నేపథ్యంలో అవసరమైన చోట అదనపు సిబ్బందిని వినియోగించి పెండింగ్ తగ్గించాలని ఆదేశించారు.ఇంటింటికీ వెళ్లి ప్రతి కుటుంబాన్ని సంప్రదించాలని,ఒక కుటుంబంలో ఒక సభ్యుడి మ్యాపింగ్ పూర్తయితే మిగిలిన అర్హులైన సభ్యులందరికీ మ్యాపింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంకా ఫారాలు సమర్పించని కుటుంబాలను గుర్తించి ప్రత్యేకంగా ఫాలోఅప్ చేయాలన్నారు. మరణించిన, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేసి, నిబంధనల ప్రకారం ముందుకెళ్లాలన్నారు. బిఎల్ఓలు ఓటర్లతో మర్యాదగా వ్యవహరించి మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైన సహాయం అందించాలని సూచించారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులను ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో గద్వాల తహసిల్దార్ హరికృష్ణ, ఉపతహసిల్దార్ వరప్రసాద్,ఎన్నికల డీటీ ఉదయ్ కిరణ్, ఆర్ఐ వెంకటేశ్వర్ రెడ్డి, సూపర్వైజర్ తిమ్మప్ప, బిఎల్ఓ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

# శాతవాహన ఫార్మసీ కళాశాలలో హ్యాండ్సమ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్

**కరీంనగర్** శాతవాహన విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాలలో డిగ్రీ కళాశాలల 100 రోజుల విద్యా ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జరిగిన హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా కె శ్రీశైలం అధ్యక్షతన జరిగగా ముఖ్యఅతిథిగా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి సతీష్ కుమార్ , పాల్గొని మాట్లాడుతూ క్యాన్సర్ ఔషధాలకు మొక్కలు కీలకమైనవని క్యాన్సర్ ఔషధాలకొరకు చేసే పరిశోధనలో మొక్కలు కీలక పాత్ర వహిస్తాయని అన్నారు.ప్రముఖ టాక్సానమిస్ట్ డా ఇ నరసింహ మూర్తి వక్త గా పాల్గొని ప్రసంగించారు. డా మూర్తి మాట్లాడుతూ మొక్కలు ఎన్నో ఔషధాలకు నిలయమని, ముఖ్యంగా సంక్లిష్ట సమ్మేళనాలతో కూడిన క్యాన్సర్ ఔషధాల తయారీలో ప్రముఖ పాత్ర వహిస్తాయని అన్నారు. క్యాన్సర్ మందులను ఉత్పత్తి చేసే వివిధ మొక్కల గురించి విశదీకరించారు.

ఈ కార్యక్రమం లో కన్వీనర్ డా పి క్రాంతి రాజు మాట్లాడుతూ క్యాన్సర్ని లొంగదీసుకోవడం ఒక సవాలుగా స్వీకరించాల్సి ఉంటుందని, ఇందుకు మొక్కల పై అనేక ప్రయోగాలు చేయాల్సి ఉంటుందని అన్నారు. అనంతరం స్థానికంగా దొరికే బిళ్లగన్నేరు ఆకుల నుండి క్యాన్సర్ రసాయనాలను వేరుచేసే ప్రక్రియను ప్రిన్సిపల్ డా శ్రీశైలం ప్రయోగశాల లో ప్రయోగాత్మకంగా వివరించారు. ముగింపు సమావేశం లో పాల్గొన్న అకడెమిక్ ఎంపవర్మెంట్ కోఆర్డినేటర్ డా శ్రీరంగ ప్రసాద్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం తరపున విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు 100 రోజుల కార్యక్రమం చేపడున్నామని విధ్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమం లో నగరం లోని ఎస్ ఆర్ ఆర్ కళాశాల మరియు మహిళా డిగ్రీ కళాశాల లకు చెందిన అధ్యాపకులు విధ్యార్థులు పాల్గొన్నారు

# పదోన్నతి పొందిన శ్యామ్ కు ఘనంగా వీడ్కోలు



గుంటూరు, జూలై 10(భారత శక్తి ): గుంటూరు సమాచార పౌర సంబంధాల శాఖలో డివిజనల్ పౌర సంబంధాల అధికారిగా పని చేస్తూ నెల్లూరు జిల్లా పౌర సంబంధాల అధికారిగా పదోన్నతిపై బదిలీపై వెళ్ళిన జె శ్యామ్ కుమార్ కు గుంటూరు కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఉప సంచాలకులు లోచర్ల రమేష్ మాట్లాడుతూ పదోన్నతి పొందిన శ్యామ్ కుమార్ కు శుభాకాంక్షలు తెలిపారు. వృత్తి పట్ల నిబద్ధత, అంకితభావంతో శ్యామ్ కుమార్ పనిచేశారని కొనియాడారు. కార్యాలయ పనులలో తనదైన శైలిలో పని చేస్తూ అందరి అభిమానాన్ని చూరగొన్నారని చెప్పారు. అన్ని వేళల కార్యాలయ విధులకు అందుబాటులో ఉండేవారని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యనిర్వహక సమాచార ఇంజనీర్ ఎ.కిషోర్, డివిజనల్ పౌర సంబంధాల అధికారి ఎ.వి.ఎస్ రవీంద్ర బాబు, సీనియర్ అసిస్టెంట్ డి.సురేష్, టైపిస్ట్ లు శివరామ కృష్ణ, బుజ్జి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## ఎల్‌కేజీ చిన్నారుల ప్రతిభకు వేదికగా

# వాసవి హైస్కూల్ ప్రత్యేక అసెంబ్లీ

**- చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాల పెంపే లక్ష్యం : ప్రిన్సిపల్ హరిప్రసాద్**




**నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూలై 9 (భారత శక్తి):** నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని వాసవి హైస్కూల్‌లో గురువారం ఎల్‌కేజీ చిన్నారులతో నిర్వహించిన ప్రత్యేక అసెంబ్లీ కార్యక్రమం ఆకట్టుకుంది. చిన్నారులు తమ ప్రతిభ, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసాన్ని చాటుతూ నిర్వహించిన ప్రదర్శనలు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల నుంచి ప్రశంసలు అందుకున్నాయి.ప్రార్థనతో ప్రారంభమైన అసెంబ్లీలో చిన్నారులు గుడ్ మార్నింగ్,జాతీయ పతాకం ప్రాముఖ్యత, వాతావరణ వివరాలు (వెదర్ రిపోర్ట్), ప్రతిజ్ఞ, ఆరోగ్యం, పరిశుభ్రత, మంచి అలవాట్లు వంటి అంశాలపై స్వయంగా రూపొందించిన రంగురంగుల చార్ట్‌లతో చక్కగా వివరణ ఇచ్చారు. చిన్న వయస్సులోనే ధైర్యంగా వేదికపై నిలబడి స్పష్టమైన ఉచ్చారణతో మాట్లాడిన తీరు అందరినీ విశేషంగా ఆకట్టుకుంది.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ హరిప్రసాద్ మాట్లాడుతూ, చిన్నారుల్లో బాల్యం నుంచే వేదికపై మాట్లాడే నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మక ఆలోచన, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఇలాంటి ప్రత్యేక అసెంబ్లీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠ్యాంశాలతో పాటు వ్యక్తిత్వ వికాసానికి కూడా ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.విద్యార్థులు తయారు చేసిన ఆకర్షణీయమైన చార్ట్‌లు, వారి అమాయకమైన ప్రదర్శనలు, ఉత్సాహభరితమైన పాల్గొనడం సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రతి చిన్నారిని ఉపాధ్యాయులు అభినందిస్తూ మరింత ప్రోత్సాహం అందించారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులలోని ప్రతిభను వెలికితీసే విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని పాఠశాల యాజమాన్యం వెల్లడించింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ హరిప్రసాద్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని చిన్నారులను అభినందించారు.

## గ్రామాల పారిశుద్ధ్య నిర్వహణలో

# సర్పంచ్‌ల పాత్ర కీలకం

**- జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు**




నిర్మల్ జిల్లా ప్రతినిధి,జులై 10(భారత శక్తి) : శుక్రవారం ముధోల్ మండలంలోని తరోడ గ్రామంలో గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళికలపై సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి సర్పంచులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సర్పంచ్ లకు గ్రామ పరిపాలన అంశాలపై స్పష్టమైన అవగాహన ఉండాలని పేర్కొన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అత్యంత కీలకమని వివరించారు. ఇందుకోసం సర్పంచ్ లు కృషి చేయాలని అన్నారు. గ్రామాల్లో చెత్త సేకరణ అంశంపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంచాలని వివరించారు. తడి పొడి చెత్తలను వేరువేరుగా సేకరించాలన్నారు. చెత్త నుంచి సేంద్రియ ఎరువుల తయారీ, ఆదాయ సృష్టి చేసుకోవచ్చని అన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రతి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి అంకితభావంతో కృషి చేయాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిఆర్డిఓ విజయలక్ష్మి, పంచాయతీరాజ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బాసరలో సబ్ కలెక్టర్ పర్యటన

**- శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయ పునరుద్ధరణ పనుల పరిశీలన**

**- నూతన తహసీల్ కార్యాలయ స్థలాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూలై 10( భారత శక్తి )** భైంసా సబ్ కలెక్టర్ శుక్రవారం బాసరలో పర్యటించి శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానంలో కొనసాగుతున్న పునరుద్ధరణ పనులను పరిశీలించారు. ఆలయ అభివృద్ధి పనుల పురోగతిని సంబంధిత అధికారులతో సమీక్షించి, నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులు చేపట్టాలని, అభివృద్ధి కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.అనంతరం బాసరలో నూతన తహసీల్ కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాన్ని సబ్ కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించి, ప్రభుత్వ ఆమోదిత ప్రణాళికల ప్రకారం నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.ప్రజలకు మరింత మెరుగైన పరిపాలనా సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయాలనే లక్ష్యంతో ఈ పర్యటన చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాసర తాసిల్దార్ పవన్ చంద్ర. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## నూతన పట్టువస్త్రలంకరణ మహోత్సవంలో

# పాల్గొని చిన్నారి సింధుప్రియకు ఆశీర్వాదం

**- బీఆర్ఎస్ మండల ముఖ్య నాయకులు సుందర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఏల సుందర్**




**దేవరుప్పుల(భారత శక్తి)జులై 10:** దేవరుప్పుల మండల కేంద్రానికి చెందిన చింత మౌనిక – అనిల్ దంపతుల కుమార్తె ఇందు ప్రియ నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవం శుక్రవారం మండల కేంద్రంలోని తిరుమల గార్డెన్స్ లో నిర్వహించగా ఆ వేడుకలో హాజరై చిన్నారిని బీఆర్ఎస్ మండల ముఖ్య నాయకులు సుందర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఏల సుందర్ ఆశీర్వదించారు. చిన్నారి కుటుంబసభ్యులతో, స్థానిక ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏల సుందర్ మాట్లాడుతూ చిన్నారి ఇందు ప్రియ నిండు నూరేళ్ళ సుఖ సంతోషాలతో ఉండాలని, కుటుంబ సభ్యులను అభినందిస్తూ ఆ భగవంతుడి ఆశీస్సులు నిండుగా ఉండాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట చింత యాదనరసింహా,జోగు ప్రవీణ్,మనోజ్ బంధుమిత్రులు తదితరులు ఉన్నారు.

# ఆహార హక్కుల అమలులో రాజీ ఉండొద్దు..!!

**- రాష్ట్ర ఆహార సంఘం సభ్యురాలు గంజిమాల దేవి**

**- అంగన్వాడీలు, పాఠశాలలు, వసతి గృహాలు, ఆరోగ్య కేంద్రాలు, ప్రజా పంపిణీ దుకాణాల ఆకస్మిక తనిఖీ**





**కడప, జూలై 10(భారత శక్తి ):** ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఆహార భద్రత కల్పించడం అధికారుల బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార సంఘం సభ్యురాలు గంజిమాల దేవి అన్నారు. వైయస్సార్ కడప జిల్లాలో గురువారం ఆమె విస్తృత క్షేత్ర పర్యటన నిర్వహించి అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, వసతి గృహాలు, ఆరోగ్య కేంద్రాలు, ప్రజా పంపిణీ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీకే దీన్నే మండలంలోని ఎర్రమాచపల్లి అంగన్వాడీ కేంద్రం, పెండ్లిమర్రి మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కోరవండ్లపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పోషకాహారం, మధ్యాహ్న భోజనం, తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం నంది మండలంలోని రెండు అంగన్వాడీ కేంద్రాలు, జడ్పీ ఉన్నత పాఠశాల, వేంపల్లి మండలంలోని రాజీవ్‌నగర్ కాలనీ అంగన్వాడీ కేంద్రం, చింతారంపల్లి ప్రజా పంపిణీ దుకాణం, ఆంధ్రప్రదేశ్ నివాస మైనారిటీ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. రేషన్ సరుకుల పంపిణీ విధానం, నిల్వలు, ఆహార పదార్థాల నాణ్యత, రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వేముల మండలంలోని బేస్తవారిపల్లిలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల, జే.ఎం. వీధిలోని రెండు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించిన ఆమె, పులివెందుల మండలంలోని ఎంఎల్ఎస్ నిల్వ కేంద్రం, గిరిజన సంక్షేమ నివాస వసతి గృహం, సామాజిక సంక్షేమ ప్రీ-మెట్రిక్ వసతి గృహాలను తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వంటశాల పరిశుభ్రత, నిల్వ గదులు, తాగునీటి సౌకర్యాలు, వసతి గృహాల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గంజిమాల దేవి మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, వసతి గృహాల్లో ఆహార పదార్థాల నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు.

ప్రజా పంపిణీ వ్యవస్థ పారదర్శకంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని, రేషన్ సరుకులు నిర్ణీత ప్రమాణాలతో లబ్ధిదారులకు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అలాగే పరిశుభ్రత, ఆహార నిల్వ విధానాలు, తాగునీటి సౌకర్యాలు, రికార్డుల నిర్వహణలో లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని సంబంధిత అధికారులకు ఆమె సూచించారు.

# జఫర్ గడ్ అభివృద్ధికి పాటుపడుదాం

- జఫర్ గడ్ గ్రామాన్ని అభివృద్ధి చేసే బాధ్యత నాది. - అందరు కలిసి లేకపోవడం వల్ల నష్టం జరుగుతుంది.
- అందరూ కలిసి అభివృద్ధి పనుల ప్రతిపాదనలు చేయండి మంజూరు చేస్తా..
- అభివృద్ధి కోసం వ్యక్తి గత విభేదాలు పక్కన పెట్టండి. - హ్యామ్ రోడ్లతో జఫర్ గడ్ రూపు రేఖలు మారబోతున్నాయి.
- నెల రోజుల్లో 50లక్షలసిసి రోడ్లు మంజూరు చేస్తా. - వేల్పుగొండ లక్ష్మి నరసింహ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసుకుందాం.
- జఫర్ గడ్ అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ సహకరించాలి: మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి








**జనగామ(భారత శక్తి)జులై 10:** జఫర్ గడ్ మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 27లక్షల 50వేల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్ల ప్రారంభించి 10లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. అలాగే గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం జఫర్ గడ్ మండల కేంద్రంలోని రామాలయం ఆవరణలో జఫర్ గడ్, ఐనవోలు మండలాలకు సంబందించిన 8మంది కళ్యాణ లక్ష్మి – షాదీ ముబారక్ లబ్ధిదారులకు 08లక్షల 928రూపాయల విలువగల చెక్కులను అలాగే 49మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు 17లక్షల 91వేల 250రూపాయల విలువగల చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంపిణి చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో గత 15ఏళ్ళు ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి అభివృద్ధిని పట్టించుకోక చాలా నష్టపోయమని, ఇప్పుడు ఆ భారం నాపై పడుతుందని అన్నారు. గత ఎమ్మెల్యే జఫర్ గ్రామానికి ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇచ్చాడా 10లక్షల సిసి రోడ్డు ఇచ్చాడా అని ప్రశ్నించారు. పైగా విపరీతమైన అవినీతికి పాల్పడి పనులు, పథకాలు, పదవులు అమ్ముకొని చిల్లర పనులతో నియోజకవర్గ పరువు తీసిన వ్యక్తి చాలా మాటలు మాట్లాడుతున్నాడని విమర్శించారు. గత ఎమ్మెల్యే ఎం చేశాడో, ఇప్పుడు కడియం శ్రీహరి ఎం చేస్తున్నాడో ప్రజలు ఆలోచించాలని కోరారు. నేను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత జఫర్ గడ్ గ్రామానికి 50ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చానని తెలిపారు. ఎంతో చక్కగా నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇండ్లను చూస్తుంటే కడుపు నిండుతోందని అన్నారు. జఫర్ గడ్ గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి జాఫర్ గడ్ రూపు రేఖలు మార్చే బాధ్యత నాదని తెలిపారు. జఫర్ గడ్ లో చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని అందరం కలిసి జఫర్ గడ్ ను ఓ పట్టు పట్టి అభివృద్ధి చేసుకుందామని అన్నారు. అందుకు జఫర్ గడ్ నాయకులు అందరూ వ్యక్తిగత విభేదాలు పక్కన పెట్టి ముందుకు రావాలని సూచించారు. అందరూ కలిసి అభివృద్ధి పనుల ప్రతిపాదనలు తీసుకు వస్తే మంజూరు చేసే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. ఇప్పటికే చాలా నష్టపోయమని అన్నారు. నెల రోజుల్లో 50లక్షల సిసి రోడ్లు మంజూరు చేస్తానని రెండో విడత ఇందిరమ్మ ఇండ్లలో ప్రథమ ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. గిడిసెలు, కవర్లు కప్పుకొని, రేకుల ఇళ్లలో ఉంటున్న అర్హులైన పేద ప్రజలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. జఫర్ గడ్ నుండి సూరారం వరకు 6కోట్లతో డబుల్ రోడ్డు మంజూరు అయిందని అలాగే స్టేషన్ ఘనపూర్ నుండి వర్ధన్నపేట వరకు 40కోట్లతో నాలుగు లైన్ల రోడ్డు మంజూరు అయిందని ఇందులో జఫర్ గడ్ లో రెండు కిలోమీటర్లు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణంతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దింతో జఫర్ గడ్ రూపు రేఖలు మారుతాయాని తెలిపారు. అలాగే వేల్పుగొండ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి కమిటీ ఏర్పాటు చేసుకొని అభివృద్ధి పనులు చేసుకుందామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమనికి చిత్తశుద్ధితో పని చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ సంక్షేమ పథకం ప్రజలకు ఉపయోగపడుతుందని అన్నారు. గత ప్రభుత్వం చేసిన 8లక్షల 21వేల కోట్ల అప్పుకు మిత్తిలు కడుతూ ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటూ కూడా గత ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తూనే 6గ్యారెంటీల అమలులో భాగంగా అనేక కొత్త పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణి, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి చేరుతున్నాయని వెల్లడించారు. 9రోజులలో 9వేల కోట్ల రైతు భరోసా నిధులను కోటి 51లక్షల ఎకరాలకు 73లక్షల 50వేల మంది రైతుల ఖాతాలలో పెట్టుబడి సాయన్ని జమ చేసినట్లు వెల్లడించారు. ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదం ఉండాలని కోరారు. నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలనే ఏకైక సంకల్పంతో పని చేస్తున్నాన్ని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుల్ల మోహన్ రావు, పిఏసీఎస్ చైర్మన్ తీగల కరుణాకర్ రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, అన్నబోయిన బిక్షపతి, ఇల్లందుల బేబీ శ్రీనివాస్, మంచాల ఎల్లయ్య, కట్ట మనోజ్ రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో డిజిటలైజ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**– భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 10 (భారతశక్తి):** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న డిజిటలైజ్ ప్రక్రియ వేగవంతం చేయాలని భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ అన్నారు. శుక్రవారం న్యూ ఢిల్లీ నుండి కార్యదర్శి నవీన్ కుమార్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఐడిఓసి కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ.. ఎన్నికల జాబితాలో పారదర్శకత ప్రజాస్వామ్య బలోపేతానికి కీలకమని తెలిపారు. ప్రతి ఎన్నికకు ముందు ఎన్నికల జాబితాను నవీకరించవలసిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు.18 సంవత్సరాల వయస్సు నుండి అర్హత కలిగిన ప్రతి భారత పౌరుడు, ఆయా నియోజకవర్గంలో సాధారణ నివాసితులు, చట్టపరంగా అనర్హులు కాని వారు ఓటరుగా నమోదు కావచ్చని తెలిపారు. ఇంటింటి సర్వేలు, బూత్ స్థాయి అధికారుల పని తీరు, ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, సవరణ ప్రక్రియలను ఖచ్చితత్వంతో నిర్వహించాలని ఆదేశించారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా మిగిలిన ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి ఈ నెల 24 తేదీ నాటికి డిజిటైజేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ నిర్ణీత కాల వ్యవధిలో ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని, దేశ వ్యాప్తంగా గతంలో కూడా పలు మార్లు ప్రత్యేక సవరణ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఏ ఒక్క అర్హులైన పౌరుడు ఓటు హక్కు కోల్పోకుండా, అనర్హులు జాబితాలోకి చేరకుండా జిల్లా ఎన్నికల అధికారులు కఠిన చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారమ్ అందజేసిన ఓటర్లందరినీ ముసాయిదా జాబితాలో చేర్చడం జరుగుతుందని, విచారణ లేకుండా ఏ ఓటరు పేరును జాబితా నుండి తొలగించకూడదని తెలిపారు. దరఖాస్తుదారులకు తగిన విచారణ ద్వారా వారి అర్హతను ధృవీకరించిన అనంతరం తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. తుది జాబితా ప్రచురణ తర్వాత ఎవరైనా అసంతృప్తిగా ఉంటే జిల్లా మేజిస్ట్రేట్‌కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ చేపట్టడం జరుగుతుందని, ఏ పోలింగ్ కేంద్రంలోనూ 1 వేయి 200 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉండకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ... ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ 99.6 శాతం, డిజిటైజేషన్ ప్రక్రియ 21.94 శాతం పూర్తి అయ్యాయని, మిగిలిన ఫారాలు ఈరోజు పంపిణీ పూర్తి చేసి డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఇల్లందు ఈఆర్వో రవీంద్రనాథ్, కొత్తగూడెం తహాశీల్దార్ పుల్లయ్య, మణుగూరు తహాశీల్దార్ నరేష్, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, డిఎంఎల్ టి సాయి కృష్ణ, పినపాక ఎలక్షన్ డిటి అనూష, సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## బద్వేలు నియోజకవర్గంలో డిసిసిబి చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి సుడిగాలి పర్యటనలు


**- పలువురు టిడిపి నాయకులను కలుస్తున్న సూర్యనారాయణ రెడ్డి**




**బద్వేలు** బద్వేలు నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో డిసిసిబి చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు బద్వేలు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జిగా సూర్యనారాయణ రెడ్డి పేరు దాదాపు ఖరారు కావడంతో అన్ని మండలాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులను కార్యకర్తలను కలుసుకుంటున్నారు బద్వేలు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ మరింత బలంగా ఉండడం కోసం ఆయన ఈ పర్యటనలు మొదలుపెట్టారు అందులో భాగంగా ×పోరుమామిళ్ళలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యనమల సుధాకర్ ని మర్యాదపూర్వకంగా కలిసిన డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి బద్వేల్ నియోజకవర్గం,పోరుమామిళ్ళ పట్టణంలోని వారి నివాసంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ సర్పంచ్ యనమల సుధాకర్ ని ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు తదితర అంశాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ పార్టీ ఆశయాలను బలోపేతం చేయడంతో పాటు సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడానికి సమన్వయంతో పనిచేయాలని అభిప్రాయపడ్డారు. అనంతరం పార్టీ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.ఇంకా పలువురు టిడిపి నాయకులు కలిశారు పార్టీ కోసం మరింత కష్టపడి ముందుకు పోతామని వచ్చే ఎన్నికల నాటికి పార్టీని బలోపేతం చేసి బద్వేలు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎవరు వేస్తామని సూర్యనారాయణ రెడ్డి వారిని కోరారు

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీతో ఆపన్నులకు అండగా బత్తుల కుటుంబం

**- రాజానగరం ఎమ్మెల్యే బలరామకృష్ణ ఆదేశాలతో సతీమణి వెంకటలక్ష్మి చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ**



**సీతానగరం** రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ గారి ఆదేశాల మేరకు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించారు.ఆయన సతీమణి మరియు జనసేన పార్టీ "నా సేన కోసం నా వంతు" రాష్ట్ర కమిటీ కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి ఈరోజు సీతానగరం మండలం ముగ్గళ్ల మరియు ఇనుగంటివారిపేట గ్రామాలకు చెందిన 7 మంది లబ్ధిదారులకు స్వయంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. గంగుల శ్రీనివాస్ - రూ.32,376/-, దార్ల వీరేంద్ర - రూ.23,603/-, చాపర్ల కార్తీక్ సాయి విహాన్ - రూ.30,000/-, కొప్పుల ఆదినారాయణ - రూ.20,284/-, నరుకుర్తి నీలావతి - రూ.1,05,000/-, దూలం పోలవేణి - రూ.35,000/-, కొండు పద్మజలాశ్రీ - రూ.1,86,462/- లు. మొత్తం: రూ. 4,32,725/-లబ్ధిదారుల కృతజ్ఞతచెక్కులు అందుకున్న లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, "ఆసుపత్రి ఖర్చుల కోసం అప్పులు చేయాల్సి వచ్చింది. సకాలంలో సీఎంఆర్ఎఫ్ సహాయం అందించిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ వెంకటలక్ష్మి వారికి మా హృదయపూర్వక ధన్యవాదాలు" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 1500 హామీ ఏమైంది లబ్ధిదారుల నిరీక్షణ

**- ప్రభుత్వం నుండి స్పష్టత లేదు**



**దేవీపట్నం** ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీల్లో "ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఆర్థిక సహాయం"× కూడా ఒకటి. ఆ హామీపై రాష్ట్రంలోని కోట్లాది మంది మహిళలు ఆశలు పెట్టుకున్నారు. కానీ ప్రభుత్వం ఏర్పడి ఇన్ని రోజులైనా ఆ పథకం అమలుకు సంబంధించిన అధికారిక ప్రకటన గానీ, నిధుల విడుదల గానీ ఇంకా జరగలేదు.ఎన్నికలప్పుడు ప్రతి ఇంటికి 1500 వస్తుందని చెప్పారు. గృహిణులకు, పేద మహిళలకు అది పెద్ద ఊరట అనుకున్నాం. కానీ ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఖాతాలో పడలేదు. ఎప్పుడు వస్తుందో ఎవరూ చెప్పడం లేదు" అని పలువురు మహిళలు వాపోతున్నారు.స్కూల్ ఫీజులు, నిత్యావసర ఖర్చులు, వైద్య ఖర్చుల కోసం ఈ డబ్బు ఉపయోగపడుతుందని ఎదురుచూస్తున్నామని వారు అంటున్నారు.ప్రభుత్వం వెంటనే ఈ హామీపై స్పష్టత ఇవ్వాలని, ఎప్పటినుండి అమలు చేస్తారో తేదీ ప్రకటించాలని మహిళా సంఘాలు, ప్రతిపక్ష నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం త్వరగా స్పందించి హామీని నెరవేర్చాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

## కాన్వెంట్ కూడలి బ్రిడ్జికి బీటలు..

**- అధికారులు అప్రమత్తం**



**విశాఖపట్నం** విశాఖ షీలానగర్ నుంచి కాన్వెంట్ జంక్షన్ మీదుగా నగరంలోకి వెళ్లే ప్రధానమార్గం పోర్టు రోడ్డులో ఘోర ప్రమాదం తప్పింది. కాన్వెంట్ కూడలికి సమీపంలో ఉన్న బ్రిడ్జి ఎన్నో ఏళ్ల కిందట నిర్మించినది కావడంతో నడకమార్గం కొంత మేర గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా కూలిపోయి కిందనున్న రైల్వే ట్రాక్ పై శిథిలాలు పడ్డాయి. ఆసమయంలో కింద ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదం కారణంగా విశాఖ పోర్టు నుంచి ఐరన్ ఓర్, కోల్ తీసుకువెళ్లే గూడ్స్ వ్యాగన్ రవాణాకు అంతరాయం ఏర్పడింది. నిత్యం పోర్టు రోడ్డులో భారీ వాహనాలు ప్రయాణిస్తూ ఉంటాయి. కొంతమంది ఆ మార్గం మీదుగా నడుస్తూ ఉంటారు.. అలా నడిచే సమయంలో నడకదారి కూలిపోయి ఉంటే కొందరి ప్రాణాలు బలైపోయేవి. సమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ట్రాక్ క్లియర్ చేయగా, పోర్టు సిబ్బంది బ్రిడ్జిపైన ఎవరు అందరిలో నడకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా పోర్టు అధికారులు స్పందించి ఆ మార్గంలో భారీ వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

## అర్హులైన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలి

**- డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ**



**భద్రాద్రి కొత్తగూడెం** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి అని భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ సూచించారు.న్యూఢిల్లీ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తో కలిసి అన్ని జిల్లాల ఎన్ని ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి అని భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ సూచించారు.. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.జూలై 24లోపు డిజిటలైజేషన్ పూర్తి చేయాలని, అర్హులైన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించిన ఓటర్లను ముసాయిదా జాబితాలో చేర్చాలని, విచారణ లేకుండా ఏ ఓటరు పేరును తొలగించరాదని స్పష్టం చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 1,200 మందికి మించకుండా ఓటర్ల క్రమబద్ధీకరణ చేపట్టాలని ఆదేశించారు.రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ 99.6%, డిజిటలైజేషన్ 21.94% పూర్తైందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈఆర్వో రవీంద్రనాథ్, తహసీల్దార్లు పుల్లయ్య, నరేష్, ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, సాయి కృష్ణ, అనూష, నవీన్ తదితరులు పాల్గొన్నారు. .

## పాడి రైతుల సంక్షేమానికి కృషి



**జోగులాంబ** పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని అందులో భాగంగానే గేదెల కొనుగోలుకు సహకారం అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రవేశపెట్టిన మినీ డైరీ పథకానికి ఎంపికైన 12 మంది రైతులు గేదెలు కొనుగోలు చేసేందుకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం వెళుతున్న సందర్భంగా శుక్రవారం ఐడిఓసి ఆవరణలో వాహనాన్ని జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు గేదెల కొనుగోలుకు రూ.2 లక్షలకు గాను 60 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందని,మిగిలిన 40 శాతం బ్యాంకు లోన్ పొందడం జరుగుతుందన్నారు.ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని మంచి అధిక పాల ఉత్పత్తినినంబర్ ప్లేట్ లేని, నిబంధనలకు విరుద్ధమైన వాహనాలపై మహబూబ్ నగర్ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక తనిఖీలు ? అట్టి వాహనాలపై చర్యలుజిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు నెంబర్ ప్లేట్స్ లేని ద్విచక్ర వాహనాలను శుక్రవారం మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కె.రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు లేకుండా లేదా అస్పష్టంగా, కొన్ని అంకెలు తొలగించి తిరుగుతున్న వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వాహనదారులను ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సిలింగ్ నిర్వహించి, మోటారు వాహనాల చట్టం ప్రకారం జరిమానాలు విధించారు. అనంతరం ఆయా వాహనాలకు నిబంధనలకు అనుగుణంగా సరైన రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేయించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కె.రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, కొంతమంది వాహనదారులు ట్రాఫిక్ చలాన్ల నుంచి తప్పించుకోవడం లేదా చైన్ స్నాచింగ్‌లు, ఇతర నేరాలకు పాల్పడినప్పుడు గుర్తింపు తప్పించుకునే ఉద్దేశంతో నంబర్ ప్లేట్లు లేకుండా లేదా నంబర్లను మార్పులు చేసి వాహనాలను నడుపుతున్నట్లు గుర్తిస్తున్నామని తెలిపారు. ఇటువంటి చర్యలు చట్టవిరుద్ధమని, నేరాలకు పాల్పడిన వారిని గుర్తించడంలో తీవ్ర ఇబ్బందులు కలిగిస్తాయని పేర్కొన్నారు.అందువల్ల ప్రతి వాహనదారు తమ వాహనాలకు నిబంధనలకు అనుగుణంగా స్పష్టంగా కనిపించే రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని సూచించారు."ప్రజల భద్రతే మా ధ్యేయం ? ట్రాఫిక్ నియమాలు పాటిద్దాం... రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం ఇచ్చే గేదెలు ఉండడంతో పాడి రైతులను అక్కడికి పంపిస్తున్నట్లు తెలిపారు.గేదెల కొనుగోలుకు సంబంధిత శాఖల పలువురు అధికారులు కూడా రైతుల వెంట అక్కడికి వెళ్లి సహకరిస్తారన్నారు.రైతులు కొనుగోలు చేసిన గేదెలు జాగ్రత్తగా వారి ఇంటికి చేరేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిని నుషిత, పశుసంవర్ధక శాఖ అధికారి వెంకట్ నారాయణ,ఎల్డియం శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

## మీ ప్రమాణం యాప్‌తో పారదర్శక పాలనకు శ్రీకారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా




**నిర్మల్ జిల్లా ప్రతినిధి, జులై 10 (భారత శక్తి)** ప్రభుత్వ శాఖల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు 'మీ ప్రమాణం' యాప్ తో పాటు ప్రభుత్వ ఉద్యోగుల హాజరు, పనితీరును పర్యవేక్షించే సమగ్ర డ్యాష్‌బోర్డ్ వ్యవస్థను అమల్లోకి తీసుకువస్తున్నట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ ఎస్ డి కమిషనర్ రవికిరణ్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెవెన్యూ, మీ-సేవ, వైద్య, విద్య తదితర శాఖల 70--80 శాతం సేవలను ఈ యాప్‌తో అనుసంధానం చేసి ఒకే వేదికపై ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. ప్రస్తుతం వివిధ శాఖలు వేర్వేరు యాప్‌ల ద్వారా ఉద్యోగుల హాజరును నమోదు చేస్తున్నందున, అన్ని శాఖల హాజరు వివరాలను ఒకే డ్యాష్‌బోర్డ్‌లో సమీకరించి ఉద్యోగుల హాజరు, విధుల నిర్వహణ, పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆగస్టు 15 నాటికి ఈ వ్యవస్థను పూర్తిస్థాయిలో అమల్లోకి తీసుకువచ్చి, ప్రభుత్వ ఉద్యోగుల హాజరు, పనితీరు పర్యవేక్షణలో నిర్మల్ జిల్లాను రాష్ట్రానికి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఈడీఎం నదీమ్, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

## నవజాత శిశువు సేఫ్...

**- రూ. 20 లక్షల ఉచిత వైద్యం.**

**- సేవా గుణాన్ని చాటుకున్న డాక్టర్ గోపతి శ్రీనివాస్**




**మంచిర్యాల ప్రతినిధి, జూలై 10 (భారత శక్తి):** తక్కువ బరువుతో జన్మించి ప్రాణాపాయ స్థితిలో ఉన్న నవజాత శిశువు కు ఆధునాతన ఉచిత వైద్యాన్ని అందించి చిన్నారి ప్రాణాలు కాపాడి సేవా గుణాన్ని చాటుకున్నారు మంచిర్యాలకు చెందిన ప్రైవేట్ డాక్టర్ గోపతి శ్రీనివాస్. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. దహేగాం ప్రాంతానికి చెందిన పేద దంపతులకు రెండవ సంతనంలో కవల పిల్లలు జన్మించారు. వీరిలో ఒక పాప కేవలం 600 గ్రాములతో జన్మించింది. పాప పరిస్థితి చూసి తల్లిదండ్రులు ఆందోళన చెందారు. పట్టణంలోని మల్లికార్జున హాస్పిటల్ డాక్టర్ గోపతి శ్రీనివాసును సంప్రదించి తమ బిడ్డ పరిస్థితిని వివరించారు. వారి ఆర్థిక పరిస్థితి, పసిపాప పరిస్థితి చూసి చలించిపోయారు. ఇలాంటి నగదును ఆశించకుండా వారిని హాస్పిటల్ లో చేర్పించుకొని రెండు నెలలపాటు అత్యాధునిక వైద్య చికిత్సను అందించారు. పాప బరువు పెరిగి తల్లిపాలు తాగుతూ ఆరోగ్యంగా ఎదుగుతుండగా శుక్రవారం వారిని రీచార్జ్ చేశారు. తమ పాపను కాపాడి అప్పగించిన డాక్టర్కు రుణపడి ఉంటామని తల్లిదండ్రులు తెలిపారు. సుమారు 20 లక్షల రూపాయల వరకు పాపకు ఖర్చు అయ్యేదని వారు తెలిపారు. తమ కుటుంబానికి డాక్టర్ దేవుడిగా నిలిచారని కన్నీళ్లు పెట్టుకున్నారు.

## ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో డిజిటలైజ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**- భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ**




**కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జులై 10:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న డిజిటలైజ్ ప్రక్రియ వేగవంతం చేయాలని భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ అన్నారు. శుక్రవారం న్యూ ఢిల్లీ నుండి కార్యదర్శి నవీన్ కుమార్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల జాబితాలో పారదర్శకత ప్రజాస్వామ్య బలోపేతానికి కీలకమని అన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా మిగిలిన ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి ఈ నెల 24 తేదీ నాటికి డిజిటైజేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ నిర్ణీత కాల వ్యవధిలో ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని, దేశ వ్యాప్తంగా గతంలో కూడా పలు మార్లు ప్రత్యేక సవరణ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఏ ఒక్క అర్హులైన పౌరుడు ఓటు హక్కు కోల్పోకుండా, అనర్హులు జాబితాలోకి చేరకుండా జిల్లా ఎన్నికల అధికారులు కఠిన చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారమ్ అందజేసిన ఓటర్లందరినీ ముసాయిదా జాబితాలో చేర్చడం జరుగుతుందని, విచారణ లేకుండా ఏ ఓటరు పేరును జాబితా నుండి తొలగించకూడదని తెలిపారు. దరఖాస్తుదారులకు తగిన విచారణ ద్వారా వారి అర్హతను ధృవీకరించిన అనంతరం తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. తుది జాబితా ప్రచురణ తర్వాత ఎవరైనా అసంతృప్తిగా ఉంటే జిల్లా మేజిస్ట్రేట్‌కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ చేపట్టడం జరుగుతుందని, ఏ పోలింగ్ కేంద్రంలోనూ 1 వేయి 200 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉండకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ 99.6 శాతం, డిజిటైజేషన్ ప్రక్రియ 21.94 శాతం పూర్తి అయ్యాయని, మిగిలిన ఫారాలు ఈరోజు పంపిణీ పూర్తి చేసి డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయడం జరుగుతుందని తెలిపారు. కామారెడ్డి జిల్లా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మ్యాపింగ్ చేసిన డాటా ఆధారంగా ఎన్యుమరేషన్ ఫారాలను సరిచూసుకొని డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, కామారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాజేశ్వర్, ఎన్నికల విభాగం సిబ్బంది, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు

**- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.**



భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూలై 10: శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజుల (జులై 1వ తేది నుండి 31 వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాధని, నిబంధనలకు విరుద్దంగా డి.జే వినియోగించారాదని తెలిపారు. శాతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు.కాబట్టి జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

# రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటా

**- యాదగిరిగుట్ట పిఏసిఎస్ నూతన చైర్మన్ చీర శ్రీశైలం**



భారత శక్తి, జూలై 10 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి):రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమ్యలను సత్వరమే పరిష్కరించే ప్రయత్నం చేస్తానని యాదగిరిగుట్ట పిఏసిఎస్ నూతన చైర్మన్ చీర శ్రీశైలం అన్నారు. యాదగిరిగుట్ట పిఏసిఎస్ నూతన పాలకవర్గం గురువారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా చీర శ్రీశైలం మాట్లాడుతూ తాను కూడా రైతు కుటుంబం నుండే వచ్చానని, 1994 వ సంవత్సరం నుండే పాల సంఘం చైర్మన్ గా పని చేశానని గుర్తు చేశారు. చైర్మన్ పదవిని ఒక బాధ్యతగా చూస్తానని రైతులకు ఎరువుల సమస్య గానీ, ధాన్యం కొనుగోలు సమయంలో గానీ అందుబాటులో ఉంటానని తెలిపారు. అదేవిధంగా సంఘంలో నూతన సభ్యత్వాలు పెంచుతూ పాత రైతుల సభ్యత్వాల విషయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని పేర్కొన్నారు. మరియు యూరియా యాప్ వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకుకెళ్తామని అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యల సహకారంతో యాదగిరిగుట్ట సహకార సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానని తెలిపారు.

# నేడే జాతీయ లోక్ అదాలత్"

## జిల్లా వ్యాప్తంగా 29 బెంచీలు ఏర్పాటు

కడప, జూలై 10(భారత శక్తి ): 11-07-2026 (శనివారము) వ తేదిన "జాతీయ లోక్ అదాలత్ ను" వినియోగించుకోండి సత్వర న్యాయం పొందండి:గౌరవ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యూఢిల్లీ మరియు గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ , అమరావతి వారి ఆదేశానుసారంగా గౌరవ జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప వారి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టులలో 11-07-2026 వ తేదీన ఉదయం 10:30 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు "జాతీయ లోక్ అదాలత్" నిర్వహించ బడుతుంది.జిల్లా వ్యాప్తంగా 29 బెంచీలు ఏర్పాటు చేయడం జరిగినది. కడప నందు 8, ప్రొద్దుటూరు నందు 5, రాజంపేట నందు 3, రాయచోటి నందు 3, బద్వేల్ నందు 2, సిద్ధవటం, మైదుకూరు, కమలాపురం, పులివెందుల, జమ్మలమడుగు, లక్కిరెడ్డిపల్లి, నందలూరు మరియు రైల్వే కోడూరు నందు ఒక్కొక్క బెంచిని ఏర్పాటు చేయడం జరిగినది.మరింత సమాచారం కొరకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్: 08562 258622, 244622 ఈమెయిల్ అడ్రస్: kadapa.dcourts.gov.indlsakdp@gmail.com

కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్ లో తమ కేసులను రాజీ చేసుకుని సత్వర న్యాయం పొందవచ్చును. న్యాయవాదులు, రెవెన్యూ అధికారులు, బ్యాంక్ అధికారులు, ఇన్సూరెన్స్ అధికారులు, లేబర్ డిపార్ట్మెంట్ అధికారులు, చిట్ ఫండ్ కంపెనీ ప్రతినిధులు, రవాణా శాఖ అధికారులు, పోలీసు అధికారులు మరియు ఇతర శాఖల అధికారులు "జాతీయ లోక్ అదాలత్ ను" జయప్రదం చేయవలసిందిగా డాక్టర్ సి.యామిని, చైర్మన్-కం-జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప వారు మరియు ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారు ఒక ప్రకటనలో తెలియజేశారు.

# న్యూ గడ్డిఅన్నారంలో సర్ ప్రక్రియలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ బద్దం



ఎల్బీనగర్, జూలై 10 భారత శక్తి): సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ) కార్యక్రమంలో భాగంగా గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని న్యూ గడ్డిఅన్నారం కాలనీలో అర్హులైన ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారమ్‌లను బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి పంపిణీ చేశారు. సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ల సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఓటర్లకు ఫారమ్‌ల ప్రాముఖ్యత, వాటిని సక్రమంగా నింపే విధానం గురించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో తన పేరును ధృవీకరించుకోవడం ప్రజాస్వామ్యంలో అత్యంత ముఖ్యమైన బాధ్యత. సర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని ఎన్యుమరేషన్ ఫారమ్‌లను పూర్తి చేసి సమర్పించాలని అన్నారు. అలాగే ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా సంబంధిత బీఎల్ఓలను సంప్రదించి అవసరమైన సమాచారం పొందాలని సూచించారు. ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఓటరు భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు.

# ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా నిర్వహించాలి

## భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ

ములుగు జిల్లా ప్రతినిధి, జులై 10 (భారత శక్తి): ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా నిర్వహించాలని, ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులను ఆదేశించారు. శుక్రవారం న్యూఢిల్లీ నుంచి ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ-2026 కార్యక్రమంపై భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ, తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి ములుగు జిల్లా నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి హాజరయ్యారు.

ఈ సందర్భంగా డా. పవన్ కుమార్ శర్మ వీడియో కాన్ఫరెన్స్ ద్వారామాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ ఈ నెల 24వ తేదీలోగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా ఏ పోలింగ్ కేంద్రంలోనూ 1,200 మందికి మించి ఓటర్లు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.తెలంగాణ రాష్ట్రంలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ 99.06 శాతం పూర్తయిందని, డిజిటలైజేషన్ ప్రక్రియ 33.31 శాతం పూర్తయిందని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్‌కు వివరించారు.ప్రతి బీఎల్ఓ రోజుకు కనీసం 15 శాతం డిజిటలైజేషన్ లక్ష్యాన్ని సాధించేలా చర్యలు చేపట్టాలని, ప్రతి బీఎల్ఓకు ముగ్గురు వాలంటీర్ల బృందాన్ని ఏర్పాటు చేసి సహకారం అందించాలని సూచించారు. అలాగే ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి, ఎన్నికల సూపరింటెండెంట్ సలీమ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.







# జలమండలి యూనియన్ నేత సతీష్ కుమార్ కన్నుమూత

## పార్థివదేహానికి నివాళులర్పించిన మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్.. కుటుంబ సభ్యులకు పరామర్శ

హైదరాబాద్ జులై 10 (భారత శక్తి ప్రతినిధి): తెలంగాణ జలమండలి ఉద్యోగుల సంఘం (ఎంప్లాయిస్ యూనియన్) అసోసియేట్ ప్రెసిడెంట్ చెవ్వ సతీష్ కుమార్ గురువారం తుదిశ్వాస విడిచారు. ఆయన ఆకస్మిక మరణం జలమండలి ఉద్యోగ, కార్మిక వర్గాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. సతీష్ కుమార్ మృతి పట్ల ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) ప్రచార కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యుడు (ఎంపీ) మధుయాష్కి గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

**- అంతిమ దర్శనం.. భావోద్వేగ నివాళి**

సైదాబాద్‌లోని సతీష్ కుమార్ నివాసానికి చేరుకున్న మధుయాష్కి గౌడ్, ఆయన పార్థివదేహంపై పూలమాలలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. సతీష్ కుమార్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. అనంతరం, శోకతప్త హృదయాలతో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి తన లాల్చీ సానుభూతిని, ధైర్యాన్ని తెలియజేశారు. "జలమండలి ఉద్యోగులు, కార్మిక వర్గాల సంక్షేమం కోసం, వారి హక్కుల సాధన కోసం సతీష్ కుమార్ చేసిన పోరాటాలు, అందించిన సేవలు మరువలేనివి. ఆయన మరణం కార్మిక లోకానికి తీరని లోటు."

**- మధుయాష్కి గౌడ్, మాజీ ఎంపీ**







**- తరలివచ్చిన నాయకులు, సహచరులు**

సతీష్ కుమార్ భౌతికకాయాన్ని దర్శించుకుని నివాళులర్పించిన వారిలో జలమండలి ఉద్యోగుల సంఘం నాయకులు అల్లి శ్రావణ్ కుమార్, రాఘవేందర్ రాజులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు దేరంగుల కృష్ణ, నోముల రవీందర్ గౌడ్, కొండోజు శ్రీనివాస్, విద్యా రెడ్డి, జక్కా సందీప్, నర్సింహా, సతీష్ గౌడ్ తదితరులు ఉన్నారు. నాయకులంతా సతీష్ కుమార్ సమాజానికి, జలమండలి కార్మికులకు చేసిన సేవలను కొనియాడుతూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

# గాయత్రి నగర్ గ్రంథాలయ భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



ఎల్బీనగర్, జూలై 10 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ గాయత్రి నగర్‌లో నిర్మాణంలో ఉన్న గ్రంథాలయ భవనాన్ని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి నేడు సందర్శించి పరిశీలించారు. 2023 సంవత్సరంలో రూ.98 లక్షల నిధులతో ఈ గ్రంథాలయ భవనానికి శంకుస్థాపన చేయగా, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు నేటికీ పూర్తికాక అసంపూర్తిగా మిగిలిపోయాయి. త్వరలో గ్రంథాలయాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, గ్రంథాలయ ప్రారంభోత్సవానికి అవసరమైన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ కార్యదర్శిని పిలిపించి, గ్రంథాలయానికి అవసరమైన ఫర్నిచర్, పుస్తకాలు, కంప్యూటర్లు, విద్యుత్, తాగునీరు, పరిశుభ్రతతో పాటు అన్ని మౌలిక సదుపాయాలను అత్యవసరంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవసరమైన ఏర్పాట్లు పూర్తయిన వెంటనే గ్రంథాలయాన్ని ప్రజలకు అంకితం చేస్తామని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్కల భూపాల్ రెడ్డి, దీప్లాల్ చౌహాన్, అర్కల కామేష్ రెడ్డి, దిండు భూపేష్ గౌడ్, శ్రీను నాయక్, బాల్ రాజ్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 10 ఏండ్ల జైలు శిక్ష

# సరూర్ నగర్ పోలీసుల విజయవంతమైన దర్యాప్తు.



ఎల్బీనగర్, జూలై 10 (భారత శక్తి): సరూర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నం. 396/2023, సెక్షన్లు 363, 376 ఐపీసీ మరియు పోక్సో చట్టంలోని సెక్షన్ 3 తీ/ష 4 కింద నమోదైన కేసు (ఎస్.సి. నం. 310/2023)లో నిందితుడికి శిక్ష విధిస్తూ గౌరవనీయులైన రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్‌లోని అత్యాచారాలు మరియు పోక్సో కేసుల విచారణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు తీర్పు వెలువరించింది.ఈ కేసులో మీసాల బాబన్న ఏ బాబు, వయస్సు 23 సంవత్సరాలు, మాల్దొడ్డి గ్రామం, ధారూర్ మండలం, రంగారెడ్డి జిల్లా నివాసిని కోర్టు దోషిగా నిర్ధారించింది.గౌరవనీయులైన న్యాయస్థానం నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించడంతో పాటు రూ.10,000 జరిమానా విధించింది. అలాగే బాధితురాలికి రూ.1,00,000 పరిహారం మంజూరు చేసింది.ఈ కేసు దర్యాప్తును ఎల్. రమేష్ నాయక్, అప్పటి సబ్-ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, సరోర్‌నగర్ (ప్రస్తుతం సీసీఎస్, ఎల్బీనగర్)ఎల్. రామాంజనేయులు, అప్పటి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, సరోర్‌నగర్ (ప్రస్తుతం డీజీపీ కార్యాలయం)ఎస్. జానకి రెడ్డి, అప్పటి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, సరోర్‌నగర్ (ప్రస్తుతం ఏసీపీ, మహేశ్వరం) సమర్థవంతంగా నిర్వహించారు. ప్రభుత్వ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. సత్యనారాయణ వాదనలు వినిపించారు.దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూషన్ బృందం, సీడీఓలు, సమన్ల సిబ్బంది, బ్రీఫింగ్ అధికారి, లైజన్ అధికారి మరియు మానిటరింగ్ అధికారి సమన్వయంతో కృషి చేయడంతో ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా చేయడంలో విజయవంతమయ్యారు.మహిళలు మరియు చిన్నారులపై జరిగే నేరాల విషయంలో బాధితులకు న్యాయం జరిగేలా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడంలో సరూర్‌నగర్ పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారు.

# కులగణనలో 'కోడ్' లేకపోతే బీసీలకు అన్యాయం

**- శాస్త్రీయత లోపిస్తే ప్రయోజనం శూన్యం**

**- బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్ వేదికగా మేధావుల హెచ్చరిక**

**- ప్రధానికి లేఖ రాసిన బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం**



హైదరాబాద్, జూలై 10 భారత శక్తి: దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా జరగనున్న జనగణనలో కులగణన ప్రక్రియ శాస్త్రీయంగా లేకపోతే, వెనుకబడిన తరగతుల (బీసీ)కు మరోసారి తీరని అన్యాయం జరుగుతుందని బీసీ మేధావులు ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో బీసీ ఇంటెలెక్టువల్స్ ఫోరం, బీసీ పొలిటికల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు కేంద్ర ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు.

**- కోడ్ వ్యవస్థ లేకపోతే గందరగోళమే!**

ఈ సందర్భంగా బీసీ ఇంటెలెక్టువల్స్ ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి. చిరంజీవులు మాట్లాడుతూ, ప్రస్తుతం జరుగుతున్న ప్రీ-టెస్టింగ్ ప్రక్రియపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక కోడ్లు ఉన్నప్పటికీ, ఇతర కులాల విషయంలో 'ఓపెన్-ఎండెడ్' విధానాన్ని అనుసరించడం ప్రమాదకరం. దీనివల్ల ఒకే కులం ప్రాంతాన్ని బట్టి వేర్వేరు పేర్లతో నమోదై, గణాంకాలు తప్పుల తడకగా మారుతాయి. 2011 నాటి సామాజిక-ఆర్థిక కుల గణన (ఎస్ఈసీసీ)లో ఇదే జరిగి, దేశవ్యాప్తంగా 42 లక్షల కులాల పేర్లు నమోదై గణన విశ్వసనీయత దెబ్బతిన్నది" అని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ సమగ్ర కుటుంబ సర్వే, బీహార్ కులగణనలో అనుసరించిన 'యూనిక్ కోడ్' విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**- ప్రశ్నావళిలో మార్పులు అవసరం**

2011 నాటి పాత ప్రశ్నావళితో ప్రస్తుత సామాజిక, రాజకీయ, ఆర్థిక స్థితిగతులను అంచనా వేయడం అసాధ్యమని మేధావులు స్పష్టం చేశారు. ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా ప్రశ్నావళిని సవరించాలని, తుది నిర్ణయానికి ముందు బీసీ సంఘాలు, నిపుణులతో విస్తృత చర్చలు జరపాలని కోరారు. ఈ మేరకు ప్రధానమంత్రికి పంపిన లేఖను సమావేశంలో విడుదల చేశారు.

**- అధికారుల స్పందన**

**- పూర్ణ చందర్ రావు (రిటైర్డ్ ఐపీఎస్, మాజీ డీజీపీ):**

ప్రభుత్వాలు దశాబ్దాలుగా బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తూ మోసం చేస్తున్నాయని, ప్రస్తుత గణనలో కేంద్రం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని విమర్శించారు.

**-బాలగోని బాలరాజు (బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్):** బీజేపీ బీసీ ఎంపీలు తమ గొంతును పార్లమెంటులో వినిపించాలని, కులగణనను శాస్త్రీయంగా నిర్వహించేలా ప్రధానిపై ఒత్తిడి తేవాలని కోరారు.

**- కిరణ్ కుమార్ (ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్):** యూనిక్ కోడ్ వ్యవస్థ లేని కులగణన తుపాకీలో తూటా లేని తుపాకీ వంటిదని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో దుర్గయ్య గౌడ్, ఐలి వెంకన్న, ఎర్రమాద వెంకన్న, సింగం నగేష్, నాగభూషణం, చెన్న శ్రీకాంత్, కొండల్ గౌడ్, లింగేష్ యాదవ్, జెల్ల నరేందర్, భిక్షపతి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# బద్వేల్‌లో మంత్రి ఆనం జన్మదిన వేడుకలు



**బద్వేల్** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి జన్మదినం సందర్భంగా బద్వేల్ పట్టణంలో ఉన్న అన్న క్యాంటీన్ వద్ద నాయకులు అభిమానులు ఆయన కు భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. రోజున అన్న క్యాంటీన్లో మూడు పూటలా ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ ఇ డైరెక్టర్ వద్దిబోయిన ప్రసాద్ రెడ్డి, ఎంపిపి కొండయ్య, మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షుడు వెంగల్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకుడు ఓబుల్ రెడ్డి (టని) కనుమరుల పూటి ప్రసాద్, రైస్ మిల్ ప్రసాద్ మిత్తికాయల రమణ వల్లెం కొండ సూర్య కొమ్మరాజు శ్రీనివాసులు సూర్య ప్రశాంత్, సింగరయ్య, గనుమంతు రాజేష్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు శివయ్య స్వామి ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## మున్సిపల్ సాధారణ సమావేశంలో పలు అభివృద్ధి పనులకు ఆమోదం



భారత శక్తి, జూలై 10 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి): యాదగిరిగుట్ట పురపాలక సంఘం 3వ సాధారణ సమావేశం చైర్మన్ గుండ్లపల్లి వాణీ భరత్ గౌడ్ అధ్యక్షతన గురువారం నిర్వహించడమైనది. ఈ సాధారణ సమావేశములో కౌన్సిల్ సభ్యులు మొత్తం 13 అంశములను ప్రవేశపెట్టగా అన్నింటినీ సభ్యులు ఏకగ్రీవముగా అమోదించారు. ఈ సమావేశములో సభ్యులు వారి వార్డులలో వివిధ సమస్యలను ప్రస్తావించగా చైర్మన్, కమీషనర్ సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా అవసరం ఉన్న చోట మురికి కాలువలు, సిసి రోడ్లు వేయుట, వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్య సమస్యలు, పట్టణ పరిధిలో పలు ప్రాంతాలలో రోడ్డు ఆక్రమణ మరియు కోతుల, కుక్కల సమస్యలపై చర్చించినట్లు చైర్మన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశములో మున్సిపల్ కమిషనర్ బి శ్రీనివాస్, వైస్ చైర్మన్ బరిగె రమ్య రాంచందర్, బోడ రాధ సురేష్, బూడిద మధు, కాటబత్తిని స్వప్న ఆంజనేయులు, బిట్టు సరోజ హరీష్, కర్రె మాధవి ప్రవీణ్, పెలిమెల్లి లావణ్య శ్రీధర్, పేరబోయిన సత్యనారాయణ యాదవ్, సాధునేని ధనలక్ష్మి మధుకర్, బబ్బూరి శ్రీధర్, కో ఆప్షన్ సభ్యులు గౌలికార్ అరుణ, ఎండి షరీఫ్, బండి జంగమ్మ, ఎండి పర్వీన్, అధికారులు పాల్గొన్నారు.

## వర్తకసంఘం రెన్యువల్ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి

- నిరుద్యోగుల కడుపు కొట్టడంతో పాటు స్వామి వారి ఆదాయానికి గండి
- ఎమ్మెల్యే డబ్బు మూటలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపణ
- ఇప్పటికైనా వర్తక సంఘం రద్దు చేయాలని యాదాద్రి పరిరక్షణ కమిటీ డిమాండ్




భారత శక్తి, జూలై 10 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి): యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానం కొండపైన దుకాణాలు నిర్వహించే వర్తకసంఘం రెన్యువల్ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని యాదాద్రి పరిరక్షణ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం కమిటీ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ కొండపైన వర్తక సంఘాన్ని తిరిగి రెన్యువల్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, సమస్యను తప్పుదారి పట్టించి తిరిగి లబ్ధి పొందే విధంగా స్థానిక ఎమ్మెల్యే ప్రయత్నిస్తుండగా ప్రభుత్వ అధికారులు కూడా వాళ్లకు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. వర్తక సంఘం వారు ఆశచూపే డబ్బుల మూటలకు ప్రభుత్వం తలొగ్గినట్టి స్పష్టం అవుతుందని ఆరోపించారు. నేడు స్థానిక నిరుద్యోగుల కడుపు కొడుతూ అలాగే స్వామివారి ఆదాయానికి కూడా గండి కొడుతున్నారని పేర్కొన్నారు. వర్తక సంఘం రెన్యువల్ జివో ప్రకారం కొండ కింద కొత్తగా నిర్మిస్తున్నటువంటి దుకాణం పూర్తయ్యాక వర్తక సంఘం రద్దు చేయాలనడం బాధాకరమైన విషయమని తెలిపారు. తక్షణమే వర్తకసంఘం రెన్యువల్ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని వేలం వేయాలని లేనిపక్షంలో కోర్టు ద్వారా న్యాయం కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి పరిరక్షణ కమిటీ సభ్యులు పల్లపు బాలయ్య, బండి వాసు, దండబోయిన వీరేష్, బండి అనిల్, మాటూరి బాలయ్య, కర్రె ప్రవీణ్, బాలనర్సయ్య, సంజీవ, బండ రామస్వామి, మందోజు నరేష్, వెంకటేష్, విజయ్, శ్రీశైలం, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎల్ఎన్ఎస్ సిల్క్ చేనేత సహకార సంఘం ఎన్నికల్లో గెలుపొందిన గుండు అమరీష్



భారతశక్తి, జూలై 10 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి): యాదగిరిగుట్ట పట్టణంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి సిల్క్ చేనేత సహకార సంఘం ఎన్నికలు శుక్రవారం సజావుగా జరిగాయి. ఈ ఎన్నికల్లో రెండు ప్యానల్ మధ్య జరిగిన పోటీలో ఏకపక్షంగా గుండు అమరీష్ ప్యానల్ లోని 9 మంది సభ్యులు విజయం సాధించారు. గుండు అమరేష్, గుంటి ఉమాశంకర్, నార సుభద్ర, సాయినీ సుదర్శన్, మెరుగు లెనిన్, బడుగు పార్వతమ్మ, భీమనపల్లి లక్ష్మీనారాయణ, భోగ పురుషోత్తం, కుసుమ వెంకటేష్ విజయం సాధించారు. పులగం కైలాసం ప్యానల్ కు చెందిన ఒక్క అభ్యర్థి కూడా విజయం సాధించకపోవడంతో ఎన్నికలు ఆద్యంతం రసవత్తరంగా సాగాయి.

## భరణి నక్షత్రం సందర్భంగా శ్రీ యమధర్మరాజు స్వామివారికి ప్రత్యేక పూజలు



జగిత్యాల, జూలై 10 (భారత శక్తి ప్రతినిధి): భరణి నక్షత్రం సందర్భంగా అనుబంధ దేవాలయమైన శ్రీ యమధర్మరాజు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. శ్రీ యమధర్మరాజుకు పురుషసూక్తం, శ్రీలక్ష్మీ సూక్తం, మన్యుసూక్తంతో అభిషేకం నిర్వహించడంతో పాటు ఆయుష్య హోమం, ప్రత్యేక పూజలు, హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలను వైదికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ అల్వాల శ్రీనివాస్, అర్చకులు నేరెళ్ల సంతోష్ కుమార్, ఒద్దిపర్తి కళ్యాణ్ కుమార్, అభిషేక పురోహితులు బొజ్జ సంతోష్ కుమార్, రాజగోపాల్, దేవస్థానం సిబ్బంది, అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ డిజిటలీకరణ గడువులోగా పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**

నిర్మల్ జిల్లా ప్రతినిధి, జులై 10 (భారత శక్తి ) గడువులోగా ఎస్ఐఆర్ డిజిటలీకరణ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా శుక్రవారం సాయంత్రం లోకేశ్వరం, నర్సాపూర్ (జి), నిర్మల్ అర్బన్ మండలాల్లో ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. ముందుగా లోకేశ్వరం మండలం హవర్గా గ్రామంలో ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ తీరును పరిశీలించిన కలెక్టర్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఆన్ లైన్ యాప్ లో వివరాలు చూశారు. రోజువారీగా లక్ష్యాల ప్రకారం మొత్తం ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఓటర్లకు అవగాహన కల్పించాలని వివరించారు. అనంతరం నర్సాపూర్ (జి) మండలంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు.





ఆదేశించారు. సూపర్వైజర్లు మండలంలోని మొత్తం ఓటర్ ల సంఖ్య, పంపిణీ చేసిన ఫారములు, ఇప్పటివరకు తిరిగి తీసుకున్న ఫారములు, పూర్తిచేసిన ఆన్ లైన్ ప్రక్రియ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆన్ లైన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ప్రక్రియను మొత్తం నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. స్థానిక ఓటర్ ఇంటికి వెళ్లి, వారు ఎస్ఐఆర్ పూరిస్తున్న తీరును చూశారు. ప్రక్రియపై సూచనలు చేశారు. నిర్మల్ పట్టణంలోని బర్కత్పురా ప్రాంతంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. అధికారులు ఎస్ఐఆర్ ప్రక్రియ లో ఓటర్లకు సహకారం అందిస్తారని వివరించారు. ఎటువంటి సందేహాలు ఉన్న అధికారుల ద్వారా నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాలలో తహసిల్దార్లు సూర్యారావు, లక్ష్మణ్, రాజు, మున్సిపల్ కమిషనర్ రవి బాబు, హవర్గా సర్పంచ్ భుజంగరావు, కౌన్సిలర్లు ఇర్ఫాన్, జాకీర్, మొహమ్మద్ రఫీ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

**- కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జులై,10 (భారత శక్తి) ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ అధికారులను ఆదేశించారు. న్యూఢిల్లీ నుండి ఆయన ఎస్ఐఆర్ ప్రక్రియపై, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి తో కలిసి శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఎస్ఐఆర్ ఫారముల పంపిణీ, స్వీకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను నిర్ణిత గడువులోగా, పకడ్బందీగా చేపట్టాలన్నారు. అధికారులకు కీలక సూచనలు చేశారు. జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుంచి ఈ వీసీ లో కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. వీసీ అనంతరం ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ ఫారములను ఓటర్ల నుంచి గడువులోగా తిరిగి తీసుకుని, డిజిటలైజేషన్ పూర్తి చేయాలన్నారు. ప్రక్రియను మొత్తం పారదర్శకంగా చేయాలని తెలిపారు. ఈ వీసీ లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ దేవీదాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఏడీగా బాధ్యతలు స్వీకరించిన రమేష్..!



కడప, జులై 10 (భారత శక్తి ) : సమాచార పౌర సంబంధాల శాఖ వైఎస్ఆర్ కడప జిల్లా సహాయ సంచాలకులు (ఏ.డి.)గా ఏ. రమేష్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఒంగోలు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో డిపిఆర్వోగా భాద్యతలు నిర్వహించిన ఆయన.. పదోన్నతి పొంది అదే శాఖలో కడప ఏడి గా అధికార బాధ్యతలను స్వీకరించారు.
అనంతరం ఎడి రమేష్ మాట్లాడుతూ పదోన్నతిపై ఈ జిల్లాలో ఏ.డీ.గా బాధ్యతలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ వారి సలహాలు, సూచనలు పాటిస్తూ.. శాఖా పరంగా, జర్నలిస్టుల సంక్షేమానికి, ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని రకాల సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, అధికార కార్యక్రమాలను మీడియా ద్వారా మరింత విస్తృతం చేస్తామన్నారు. కార్యాలయంలో ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సేవలో భాగస్వామ్యులే అని, ప్రభుత్వ ఆదేశాలు, ఆశయాలకు అనుగుణంగా, కార్యాలయ నియమ నిబంధనలకు గౌరవిస్తూ అందరూ కలిసికట్టుగా స్నేహపూర్వక వాతావరణంలో కర్తవ్య నిబద్ధతతో ఉద్యోగ ధర్మాన్ని నెరవేర్చాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా డీఇఇ శ్రీనివాసరావు, పిఆర్వో రవికుమార్, ఏవీఎస్ నాగయ్య, సీనియర్ అసిస్టెంట్ మహబూబ్ బాషా తదితరులు నూతన ఏడి కి పుష్ప గుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్ఫర్మేషన్ టెక్నీషియన్లు సదాశివయ్య, కృపాకర్, ఫోటోగ్రాఫర్ సొహైల్, టైపిస్టులు శ్రీవాణి, వర్ధిని, రికార్డ్ అసిస్టెంట్ లక్ష్మీపతి, అజ్మతుల్లా, టీఏ హరిబాబు, వీరారెడ్డి, విజయ కుమారి, షాహీనా బేగం, ముంతాజ్ బేగం, సునీత, సుభాషిణి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.


## కరీంనగర్ సుడ ఇన్చార్జిగా కలెక్టర్ చిత్ర మిశ్రా

**కరీంనగర్** కరీంనగర్ శాతవాహన పట్టణ అభివృద్ధి సంస్థ సుడ బాధ్యతలు జిల్లా కలెక్టర్ చేతుల్లోకి వెళ్లాయి ఇప్పటివరకు చైర్మన్గా ఉన్న కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పదవీకాలం బుధవారంతో ముగిసింది. గురువారం కొత్త సుడా చైర్మన్ ను ఎన్నుకుంటారేమో అని వేచి చూశారు కొంతమంది నాయకులు. దీంతో ప్రభుత్వం కొత్త కమిటీని నియమించే వరకు కలెక్టరే ఇన్చార్జిగా వ్యవహరించనున్నారు ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందింది పట్టణాభివృద్ధి సంస్థలో తదుపరి కార్యాచరణ పై కలెక్టర్ దృష్టి సారించనున్నారు



## గూడూరు చేనేత సహకార సంఘం ఎన్నికల్లో ఘన విజయం

**- రచ్చ శ్రావణ్‌కు అభినందనలు**




జనగామ(భారత శక్తి)జులై 10:గూడూరు చేనేత సహకార సంఘం ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన రచ్చ శ్రావణ్ కు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించబడింది. అలాగే ఈ ఎన్నికల్లో డైరెక్టర్లుగా విజయం సాధించిన విద్య మాణిక్యయ్య, గర్రెపు రాములు, చిట్యాల రాములు, చిట్టికమల రామయ్య, శ్రీపతి నవీన్, సామల నాగేందర్, రచ్చ లక్ష్మి, సామల కమలమ్మ గార్లకు కూడా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, సంఘ అభివృద్ధికి వారి సేవలు మరింతగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన పాలకవర్గం చేనేత కార్మికుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధి, సభ్యుల శ్రేయస్సు కోసం అంకితభావంతో పనిచేసి సంఘాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోలుకొండ గ్రామ పద్మశాలి కుల సంఘశీ నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, యువజన నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలు, చేనేత కార్మికులు మరియు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజేతలను అభినందించారు.

## స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ గా రేపల్లె




గుంటూరు, భారత శక్తి ప్రతినిధి, జూలై 20: రేపల్లె మున్సిపాలిటీ మరో చారిత్రాత్మక మైలురాయిని సాధించింది. ఆదాయ వనరులు పెంచుకుంటూ, ఆర్థిక ప్రమాణాలు సాధించిన మన రేపల్లెను సెకండ్ గ్రేడ్ నుంచి 'స్పెషల్ గ్రేడ్' మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయం. 1956లో తృతీయ శ్రేణిగా, 1965లో ద్వితీయ శ్రేణిగా, నేడు స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా రూపాంతరం చెందిన మన రేపల్లె సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. స్పెషల్ గ్రేడ్ హోదాతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి భారీగా నిధులు, గ్రాంట్లు రానున్నాయి. మెరుగైన పౌర సౌకర్యాలు, వీధి దీపాలు, వేగవంతమైన పట్టణాభివృద్ధికి సరికొత్త బాటలు పడనున్నాయి. రేపల్లె నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి, పట్టణ ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి నిరంతరం కృషి చేస్తూ, ఈ అప్‌గ్రేడ్‌కు సహకరించిన గౌరవ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు కు హృదయపూర్వక ధన్యవాదాలు.. ఈ శుభసందర్భంలో రేపల్లె మున్సిపాలిటీ అధికారులకు, సిబ్బందికి ముఖ్యంగా నా కుటుంబసభ్యులైన రేపల్లె ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

## మత్తు రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**




జగిత్యాల, జూలై 10 (భారత శక్తి ప్రతినిధి): నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ధర్మపురి పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన "మిషన్ పరివర్తన్" డ్రగ్స్ నిర్మూలన అవగాహన కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి లక్ష్యాల సాధనపై దృష్టి పెట్టాలని, డ్రగ్స్ నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు కలిసి యువతను సరైన దారిలో నడిపించాలని సూచించారు. ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అనంతరం విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ చేతన్ నితిన్, మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# 'లెనిన్' - మూవీ రివ్యూ!

అఖిల్ హీరోగా చేసిన సినిమానే 'లెనిన్'. సితార నాగవంశీ - నాగార్జున సంయుక్తంగా నిర్మించిన సినిమా ఇది. మురళీ కిశోర్ అబ్బూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాకి, తమన్ సంగీతాన్ని సమకూర్చాడు. భారీ విజయానికి చేరువకోవడానికి ప్రయత్నిస్తున్న అఖిల్ ను, 'ఏజెంట్' సినిమా కాస్త గట్టిగానే ఇబ్బంది పెట్టింది. దాంతో కాస్త గ్యాప్ తీసుకుని, కథపై ఎక్కువగానే కసరత్తులు చేస్తూ అఖిల్ లైన్లో పెట్టిన సినిమా ఇది. అలాంటి ఈ సినిమా ఈ రోజునే థియేటర్లకు వచ్చింది. శ్రీ రామాపురంలో 'భారతం మిట్ట' అనే ప్రదేశం ఉంటుంది. మహాభారత కాలంతో ముడిపడిన ఆ ప్రదేశంలో 'ద్రౌపది దేవి' పూజలందుకుంటూ ఉంటుంది. ప్రతి ఏటా ద్రౌపదీదేవికి అక్కడ జాతర నిర్వహిస్తూ ఉంటారు. భర్తను కోల్పోయినప్పటికీ ఆ ఊరిపై జయంతి (ఈశ్వరీరావు) పెత్తనం చేస్తుంటుంది. అనాథగా ఆ ఊళ్లో అడుగుపెట్టిన 'లెనిన్' (అఖిల్)ను ఆమెనే చేరదీస్తుంది. తన కొడుకు వసంత్ (ప్రమోద్)తో పాటు పెంచుతుంది. డాక్టర్ గా పై చదువుల కోసం వసంత్ మద్రాస్ వెళ్లిపోగా, జయంతికి సంబంధించిన పనులను చూసుకుంటూ లెనిన్ అక్కడే ఉండిపోతాడు.ఆ ఊరిపెద్ద మనుషులలో ఒకరుగా నీలకంఠం (రాంకీ) చెలామణి అవుతుంటాడు. అతనికి ఇద్దరు కూతుళ్లు ఒకరు 'వైదేహి' అయితే .. మరొకరు 'భారతి' ( భాగ్యశ్రీ బోర్సే). పట్నంలో బంధువుల దగ్గరే ఉంటూ చదువుకున్న భారతీ, తన సొంత ఊరుకు చేరుకుంటుంది. ఆమెను చూడగానే లెనిన్ మనసు పారేసుకుంటాడు. ఇక డాక్టర్ చదువును పూర్తి చేసుకుని ఆ ఊరికి తిరిగొచ్చిన 'వసంత్'ను వైదేహి ప్రేమిస్తుంటుంది. దాంతో వాళ్లిద్దరికీ పెళ్లి చేయాలని పెద్దలు నిర్ణయించుకుంటారు.ఆ గ్రామంపై పట్టు కోసం ఎమ్మెల్యే రాఘవరెడ్డి ప్రయత్నిస్తుంటాడు. తనని ఎంతమాత్రం లెక్కచేయని లెనిన్ - వసంత్ ల సంగతి చూడాలనే కోపంతో ఆయన ఉంటాడు. ఇక 'భారతం మిట్ట'పై పెత్తనం కోసం 'యతిరాజు' (శివాజీ) ఎదురుచూస్తుంటాడు. ఈ విషయంలో తనకి అడ్డుపడుతున్న జయంతిపై ప్రతీకారం తీర్చుకోవాలనే పట్టుదలతో ఉంటాడు. ఇక లెనిన్ పై మనసు పడిన భారతిని వశపరచుకోవాలనే ఉద్దేశంతో 'తులసి' (శత్రు) ఉంటాడు. ఈ నేపథ్యంలోనే వసంత్ ను పెళ్లి చేసుకోవలసిన వైదేహి కనిపించకుండా పోతుంది. దాంతో అదే ముహూర్తానికి తన చిన్న కూతురైన భారతిని వసంత్ కి ఇచ్చి పెళ్లి చేయాలని నీలకంఠం నిర్ణయించుకుంటాడు. అప్పుడు భారతి ఏం చేస్తుంది? లెనిన్ తో ఆమె వివాహం జరుగుతుందా? ఆమె అక్కయ్య వైదేహి ఏమైపోతుంది? రాఘవరెడ్డి .. యతిరాజు .. తులసితో పాటు లెనిన్ ఎదుర్కోవలసిన మెయిన్ విలన్ ఎవరు? అనేది మిగతా కథ. శ్రీ రామాపురం అనే ఊరు 'లెనిన్' అనే యువకుడిని పెంచి పెద్ద చేస్తుంది. అందువలన తనను చేరదీసి కుటుంబానికి .. తనకి నీడనిచ్చిన ఊరుకి అతను ఎంతో నమ్మకంగా ఉంటూ ఉంటాడు. అలాంటి అతను భారతి ప్రేమలో పడతాడు. అయితే ఆ ప్రేమను పెళ్లి పీటలవరకూ తీసుకుని వెళ్లడానికి అతను కొంతమంది



శత్రువులను ఎదుర్కోవలసి వస్తుంది. వాళ్లు ఎవరూ? వాళ్లతో అతనికి గల శత్రుత్వం ఏమిటి? అనేది ప్రధానమైన కథ. 1970 - 2000 కి మధ్య జరిగే ఈ కథలో అనేక కోణాలు కనిపిస్తాయి. ఆహ్లాదకరమైన గ్రామంలో అందమైన ప్రేమజంట. ఆ గ్రామంపై పట్టు కోసం ఎదురుచూసే ఒక రాజకీయనాయకుడు, అక్కడ జాతర తన చేతుల మీదుగా జరగాలనే అధికార దాహంతో ఒకరు .. ఆ ప్రేమజంటను విడదీయాలనే ఆలోచనలో మరొకరు. నమ్మిస్తూ నమ్మక ద్రోహానికి సిద్ధమవుతున్నదొకరు. ఇలా వివిధ కోణాల నుంచి అల్లుకున్న ఈ కథను ఆసక్తికరంగా ఆవిష్కరించడానికి దర్శకుడు తనవంతు ప్రయత్నం చేశాడు. ఇక దర్శకుడు 'ద్రౌపది' జాతరను ప్రధానంగా చేసుకుని, మహాభారతంలోని పాత్రలతో ముడిపెడుతూ ఈ కథను నడిపించాడు. ఫస్టు పార్టులో ఫస్టు ట్విస్ట్ ను ఇంటర్వెల్ కి ముందు పేల్చిన దర్శకుడు, అక్కడి నుంచి కథను మరింత వేడెక్కిస్తాడు. ఇక సెకండాఫ్ కూడా మరో ఒకటి రెండు ట్విస్టులతో వేగాన్ని పుంజుకుంటుంది. ద్వేషం .. ప్రతీకారం .. నమ్మకద్రోహంతో కూడిన సన్నివేశాలతో నడుస్తుంది. ఈ కథను మొత్తంగా పరిశీలన చేస్తే, అధికారం .. పెత్తనం .. కామం.. వ్యామోహం అనే బలహీనతలతో తనపై విరుచుకుపడుతున్న అరాచక శక్తులను కథానాయకుడు ఎలా ఎదుర్కున్నాడు? అనేదే ప్రధానమైన ఇతివృత్తంగా కనిపిస్తుంది. ఫస్టాఫ్ చాలా వరకూ హీరో - హీరోయిన్స్ మధ్య లవ్ - రొమాన్స్ .. అందుకు సంబంధించిన పాటలతో రక్తి కడుతుంది. ఇక సెకండాఫ్ లో ఆయా పాత్రల నిజస్వరూపాలను ఆవిష్కరించడం కనిపిస్తుంది. వారి అసలు రంగును తెలుసుకుంటూ హీరో ప్రీ క్లైమాక్స్ వైపు దిశగా కదులుతాడు. ఇక అప్పటి వరకూ సాగిన రక్తపాతం ఒక ఎత్తయితే, క్లైమాక్స్ లో చెలరేగే హింస మరో ఎత్తు. ఎంతో కొత్తగా ప్లాన్ చేశామని అనుకున్నప్పటికీ, క్లైమాక్స్ అనేది అన్ని వర్గాల ప్రేక్షకులకు సంతృప్తిని కలిగిస్తుందని చెప్పలేము. అఖిల్ నటన .. యాక్షన్ ..డాన్సులు బాగానే ఉన్నాయి. భాగ్యశ్రీ పాత్ర అంతగా బలమైనదేం కాదు గానీ, అందంగా.. ఆకర్షణీయంగా కనిపిస్తూ మార్కులు కొట్టేస్తుంది. పెళ్లి కూతురి గెటప్ లోను .. కొన్ని పాటల్లోను ఆమె గ్లామర్ కుర్రాళ్లను కట్టిపడేస్తుందనే చెప్పాలి. ఇక నెగెటివ్ షేడ్స్ కలిగిన పాత్రలో ప్రమోద్ బాగా చేశాడు. కొన్ని చోట్ల నానీలా అనిపిస్తాడు. ఈశ్వరీరావు .. శివాజీ నటన కూడా ఆకట్టుకుంటుంది. లియోన్ బ్రిట్టో ఫొటోగ్రఫీ బాగుంది. ఫస్టు పార్టులో వచ్చే రెండు డ్యూయెట్స్ లోని లొకేషన్స్ ను కవర్ చేసిన విధానం గొప్పగా అనిపిస్తాయి. తమన్ బాణీలు .. నేపథ్య సంగీతం మెప్పిస్తాయి. నవీన్ నూలి ఎడిటింగ్ కూడా మెప్పిస్తుంది. భారతం .. కురుక్షేత్రంతో పోలికపెడుతూ ఈ కథకు మరింత బలాన్ని చేకూర్చడానికి చేసిన ప్రయత్నం బాగుంది. కానీ విలన్స్ ఎక్కువమంది కావడం .. ఆ పాత్రలకు అవసరమైన పవర్ లోపించడం .. క్లైమాక్స్ ను డిజైన్ చేసే విషయంలో తీసుకున్న నిర్ణయం అసంతృప్తిని కలిగిస్తాయి. ఒక ఆసక్తికరమైన ఆరంభాన్ని నిదానంగా ట్రాక్ తప్పించారేమో అనే భావన కలుగుతుంది. కథాకథనాలు పాత పద్ధతిలోనే సాగినా, అఖిల్ యాక్షన్ కోసం .. భాగ్యశ్రీ గ్లామర్ కోసం .. ఇద్దరూ కలిసి వర్కౌట్ చేసిన కెమిస్ట్రీ కోసం ఈ సినిమాను చూడొచ్చునేమో.

## జన నాయకన్‌కు 'ఏ' సర్టిఫికేట్..
## క్లియరెన్స్ ఇచ్చిన సెన్సార్ బోర్డు



ముంబై : తమిళనాడు సీఎం విజయ్ నటించిన చిత్రం జన నాయకన్(ఝఋ ఛీఋఝస్త్రుఋఅ)పై కొత్త అప్‌డేట్ వచ్చింది. ఆ ఫిల్మ్‌కు సెన్సార్ బోర్డు క్లియరెన్స్ ఇచ్చింది. జన నాయకన్ సినిమాకు సెన్సార్ బోర్డు ఏ సర్టిఫికేట్ జారీ చేసింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ గురువారం ఈ విషయాన్ని వెల్లడించింది. సీబీఎఫ్‌సీ అధికారిక వెబ్‌సైట్‌లో జన నాయకన్ సినిమాకు చెందిన సర్టిఫికేట్ అందుబాటులో ఉన్నది. 183 నిమిషాల(3 గంటల 3 నిమిషాలు) నిడివితో ఉన్న ఈ సినిమాకు సర్టిఫికేట్ జారీ చేసినట్లు సీబీఎఫ్‌సీ చెప్పింది. అయితే ఈ సినిమా సెన్సార్ కోసం జరిగిన కట్స్ గురించి మాత్రం వెబ్‌సైట్‌లో పెట్టలేదు. వాస్తవానికి ఈ ఫిల్మ్ పొంగల్ పండుగ సందర్భంగా జనవరి 9వ తేదీన రిలీజ్ కావాల్సి ఉంది. కానీ సెన్సార్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవడంతో ఫిల్మ్ రిలీజ్ నిలిచిపోయింది. 2025 డిసెంబర్‌లో ఈ సినిమా సర్టిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. సీన్ కట్ చేస్తే.. ప్రస్తుతం తమిళనాడు సీఎంగా విజయ్ బాధ్యతలు స్వీకరించారు. తాజా సమాచారం ప్రకారం 'జన నాయకన్' ప్రపంచవ్యాప్తంగా జూలై 24, 2026న ప్రేక్షకుల ముందుకు రానుంది. విదేశీ డిస్ట్రిబ్యూటర్లకు కూడా ఇదే రిలీజ్ డేట్‌ను అధికారికంగా తెలియజేసినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. త్వరలోనే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ సినిమా విజయ్ సినీ కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మక చిత్రాల్లో ఒకటిగా నిలవనుంది. నటుడిగా ఆయన చివరి చిత్రం కావడం వల్ల అభిమానుల్లో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. రాజకీయ, యాక్షన్ అంశాలతో రూపొందిన ఈ చిత్రం విజయ్‌కు గ్రాండ్ ఫేర్‌వెల్ మూవీగా నిలుస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. హెచ్. వినోద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తోంది. యువ నటి మమితా బైజు కూడా కీలక పాత్రలో కనిపించనుండగా, బాలీవుడ్ నటుడు బాబీ డియోల్, దర్శకుడు-నటుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్, సీనియర్ నటుడు ప్రకాశ్ రాజ్, ప్రియమణి, నరైన్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. భారీ తారాగణంతో తెరకెక్కుతున్న ఈ సినిమా కథపై ఇప్పటికే భారీ ఆసక్తి నెలకొంది. ఈ చిత్రాన్ని ఖఎచీ ప్రొడక్షన్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. విజయ్-అనిరుధ్ కాంబినేషన్‌లో వచ్చిన గత చిత్రాల పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించిన నేపథ్యంలో, 'జన నాయకన్' సంగీతంపై కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి.



## ఇంకో కారు కొనడానికి ముద్దు సీన్లలో నటించాలా?
### - వ్యక్తిగత విలువలపై సాయి పల్లవి వ్యాఖ్యలు

మలయాళ చిత్రం 'ప్రేమమ్'లో మలర్ పాత్రతో కెరీర్ ప్రారంభించి, శేఖర్ కమ్ముల 'ఫిదా' సినిమాతో టాలీవుడ్‌లో 'లేడీ పవర్ స్టార్'గా గుర్తింపు తెచ్చుకున్న నటి సాయి పల్లవి. సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీలో అగ్ర కథానాయికగా దూసుకుపోతున్నా, గ్లామర్ పాత్రలకు, కమర్షియల్ హంగులకు దూరంగా ఉంటూ తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ఏర్పరుచుకున్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో సినిమాల్లో ముద్దు సన్నివేశాలు, ఇంటిమేట్ సీన్లపై ఆమె చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఇంటర్వ్యూలో యాంకర్.. "దర్శకులు ఎప్పుడైనా మిమ్మల్ని ముద్దు సన్నివేశాల్లో నటించమని అడిగారా? అలా చేయకూడదని ఎందుకు నిర్ణయించుకున్నారు?" అని ప్రశ్నించగా, సాయి పల్లవి ఎంతో నిజాయతీగా, కుండబద్దలు కొట్టినట్లు సమాధానమిచ్చారు. "అవును, చాలా మంది దర్శకులు అడిగారు.. ఇప్పటికీ అడుగుతూనే ఉంటారు.

నేను ముద్దు సీన్లు చేయనని తెలిసినా అలాంటి ఆఫర్లు వస్తుంటాయి. ఒకవేళ నాకు ఒక జీవిత భాగస్వామి లేదా బాయ్‌ఫ్రెండ్ ఉంటే, కేవలం నటన కోసమే అయినా నేను ఇంకొకరిని ముద్దు పెట్టుకోవడం నాకు సరైందిగా అనిపించదు. ఒక మనిషి సంతోషంగా బతకడానికి ఒక మంచి కుటుంబం, ఉండటానికి ఇల్లు, ప్రయాణించడానికి ఒక కారు ఉంటే చాలు. అవన్నీ భగవంతుడి దయ వల్ల నాకు ఇప్పటికే ఉన్నాయి.

కేవలం ఇంకో కారు కొనడానికో, లగ్జరీ జీవితం గడపడానికో నా వ్యక్తిగత విలువలను వదులుకుని ఇంకొకరిని ముద్దు పెట్టుకోవాల్సిన అవసరం నాకు లేదు. నా నటన చూసి మాత్రమే నన్ను సినిమాల్లోకి ఎంపిక చేసుకుంటే చేస్తాను. ఒకవేళ కథకు ముద్దు సీన్లు, ఇంటిమేట్ సన్నివేశాలే ముఖ్యం అనుకుంటే నా స్థానంలో వేరే ఎవరినైనా తీసుకోవచ్చు, అందులో నాకు ఎలాంటి అభ్యంతరం లేదు" అని స్పష్టం చేశారు. సాయి పల్లవి చేసిన ఈ వ్యాఖ్యలపై నెటిజన్లు, ఆమె అభిమానులు సానుకూలంగా స్పందిస్తున్నారు. డబ్బు, స్టార్‌డమ్ కోసం కాకుండా నమ్మిన సిద్ధాంతాలకు, వ్యక్తిగత విలువలకు ప్రాధాన్యత ఇస్తున్న ఆమె వ్యక్తిత్వాన్ని అభినందిస్తూ.. 'దటీజ్ సాయి పల్లవి' అంటూ సోషల్ మీడియా వేదికగా ప్రశంసలు కురిపిస్తున్నారు.

## అఖిల్ 'లెనిన్'కు సమంత విషెస్..
### వైరల్ అవుతున్న పోస్ట్!

అక్కినేని అఖిల్ హీరోగా నటించిన 'లెనిన్' చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలో నటి సమంత.. అఖిల్‌కు, చిత్ర బృందానికి సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలపడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 'లెనిన్' ట్రైలర్‌ను తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పంచుకున్న సమంత, అఖిల్‌ను ట్యాగ్ చేస్తూ ఒక సందేశాన్ని పోస్ట్ చేశారు. "లెనిన్ చిత్ర బృందానికి, అఖిల్‌కు ఆల్ ది వెరీ బెస్ట్. ఇప్పటికే 'పెద్ద బ్లాక్‌బస్టర్ వైబ్స్' కనిపిస్తున్నాయి" అని ఆమె పేర్కొన్నారు.

సమంత విషెస్ చెప్పడం ప్రస్తుతం నెట్టింట చర్చనీయాంశంగా మారింది. కాగా, ఇటీవలే సమంత నటించిన 'మా ఇంటి బంగారం' సినిమాపై అఖిల్ కూడా ప్రశంసలు కురిపించారు. 'లెనిన్' ప్రమోషన్లలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, ఆ సినిమా కాన్సెప్ట్ చాలా ఫ్రెష్‌గా ఉందని, వైబ్ బాగుందని అన్నారు. ఇలా ఒకరి చిత్రాలపై మరొకరు పాజిటివ్‌గా స్పందించుకోవడం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. మూడేళ్ల విరామం తర్వాత అఖిల్ నుంచి వస్తున్న సినిమా కావడంతో 'లెనిన్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. అంచనాలకు తగ్గట్టే సినిమాకు మంచి స్పందన లభిస్తుండటంతో అక్కినేని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



## ఆగస్టులో వస్తున్న 'అగధ'



అగ్ర నిర్మాతగా ఎన్నో భారీ విజయాల్ని తన ఖాతాలో వేసుకున్నారు ఎమ్మెస్ రాజు. 'డర్టీహరి' 'మళ్లీపెళ్లి' వంటి సినిమాలతో దర్శకుడిగా కూడా రాణించారాయన. ఎమ్మెస్ రాజు దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'అగధ'. కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్ ప్రధాన తారాగణం. మిస్టిక్ డివైన్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్న ఈ చిత్రాన్ని ఆగస్ట్ 14న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ 'ఇది నా డ్రీమ్ ప్రాజెక్ట్. మైథలాజికల్, మిస్టరీ, థ్రిల్లింగ్ అంశాలతో తెరకెక్కించాం. విజువల్ వండర్‌లా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేయబోతున్నాం' అన్నారు. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఈ సినిమాను తీశామని నిర్మాత కాశీ విశాలాక్షి బలుసు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: రాకేష్ వెంకటాపురం, ప్రొడక్షన్ డిజైనర్: రాజీవ్ నాయర్, నిర్మాణం: శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్, దర్శకత్వం: ఎమ్మెస్ రాజు.

# టీడీపీలోకి హితేష్

**ఒంగోలు(భారత శక్తి)** తెలుగుదేశం పార్టీలోకి మరో యువనేత ఎంట్రీకి రంగం సిద్ధం అయినట్లు తెలుస్తోంది. నందమూరి తారకరామారావు మనవడు దగ్గుబాటి హితేష్ త్వరలో పార్టీలో చేరుతారని తెలుస్తోంది. ఆయన మాజీ మంత్రులు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి ల కుమారుడు. ఆయన పూర్తి పేరు హితేష్ చెంచురాం. గతంలో కుటుంబంలో నెలకొన్న విభేదాలు సమసి పోవడంతో చేరికకు మార్గం సుగమం అయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దగ్గుబాటి పురందేశ్వరి భారతీయ జనతా పార్టీలో ఉన్నారు. ఆ పార్టీ ఎంపీగా కొనసాగుతున్నారు. దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా ఉన్నారు. దశాబ్దాలుగా చంద్రబాబుతో ఉన్న విభేదాలు సమసిపోవడంతో హితేష్ టిడిపిలో చేరికకు రంగం సిద్ధం అయింది. ఈ మేరకు చంద్రబాబు సైతం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో త్వరలో హితేష్ సైకిల్ ఎక్కడం ఖాయం అన్నట్లు తెలుస్తోంది.దగ్గుబాటి వెంకటేశ్వరరావు నందమూరి తారక రామారావు అల్లుడు. సీఎం చంద్రబాబుకు స్వయానా తోడల్లుడు. 1983 నుంచి 2009 వరకు క్రియాశీలక రాజకీయాల్లో నడిచారు. 1983 అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. అసెంబ్లీలో అడుగుపెట్టారు. 1985, 1989, 2004, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచారు. 1991లో మాత్రం ఎంపీగా విజయం సాధించారు. 1996లో రాజ్యసభకు ఎంపికయ్యారు. 2019లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. ఆయనపై టిడిపి అభ్యర్థి ఏలూరి సాంబశివరావు గెలిచారు. సుదీర్ఘకాలం పరుచూరు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుతం అక్కడ టిడిపి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఉన్నారు. అయినా సరే హితేష్ టిడిపిలో చేరి రాజకీయాలు చేయాలని భావిస్తున్నారు. పురందేశ్వరి సైతం తన భర్త వెంకటేశ్వరరావుతో కలిసి 2004లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బాపట్ల నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిచారు. రెండోసారి విశాఖ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో మంత్రిగా కూడా వ్యవహరించారు. అయితే ఆమె తర్వాత బిజెపిలో చేరారు.. ఆమె భర్త వెంకటేశ్వరరావు మాత్రం వైసీపీలో చేరారు. 2019 ఎన్నికల్లో వెంకటేశ్వరరావు వైసీపీలో ఓడిపోయిన తర్వాత సైలెంట్ మోడ్ లోకి వెళ్లిపోయారు. వాస్తవానికి చంద్రబాబుతో విభేదించి టిడిపి నుంచి బయటకు వచ్చేసారు. ఇప్పుడు అదే చంద్రబాబుతో విభేదాలు పూర్తిగా సమసి పోయాయి. పైగా సోదరుడు లోకేష్ తో హితేష్కు మంచి సంబంధాలు ఉన్నాయి. అందుకే లోకేష్ టీమ్ లో చేరేందుకు హితేష్ రాజకీయాల్లోకి ప్రవేశించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. చంద్రబాబు నుంచి సైతం గ్రీన్ సిగ్నల్ లభించడంతో త్వరలో హితేష్ టిడిపిలో చేరనున్నారు.

## రాయలసీమలో ఎకరా రూ.1.50 కోట్లు

**అనంతపురం(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెట్టుబడుల ఆకర్షణ కోసం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో దూసుకుపోతోంది. కొత్త ఇండస్ట్రియల్ పాలసీ, ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానంతో పరిశ్రమలు, కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మారుతున్న పరిస్థితులకు తగిన విధంగా వ్యూహాలతో ముందుకు సాగుతోంది. తాజాగా ఏపీ ప్రభుత్వం ఇండస్ట్రియల్ కారిడార్లలో అభివృద్ధి చేస్తున్న మూడు నోడ్‌లలో పరిశ్రమలకు భూమి కేటాయించడానికి ప్రత్యేకంగా పాలసీని తీసుకొచ్చింది. విశాఖపట్నం–చెన్నై, హైదరాబాద్–బెంగళూరు, చెన్నై–బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లలో ఉన్న కొప్పర్తి, ఓర్వకల్లు, కృష్ణపట్నం నోడ్‌లలో ఉన్న పరిశ్రమలకు ఈ పాలసీ వర్తిస్తుంది.ఏపీ ప్రభుత్వం ఇండస్ట్రియల్ కారిడార్లలోని నోడ్‌లకు సంబంధించి పరిశ్రమలకు కేటాయించే భూముల ధరల్ని ఖరారు చేసింది. అత్యధికంగా నెల్లూరు జిల్లా క్రిస్ సిటీలో ఎకరా భూమిని రూ.1.74 కోట్లకు విక్రయించాలని నిర్ణయం తీసుకున్నారు. కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లులోని నోడ్‌లో ఎకరా రూ.1.50 కోట్లుగా ఫిక్స్ చేశారు. కడప జిల్లాలో ఎకరా రూ.1.25 కోట్లు ఖరారు చేశారు. కేంద్రం నిర్ణయించిన ధరలే ఫిక్స్ చేశారు. ఏపీ పొరుగున్న ఉన్న కర్ణాటకతో పాటుగా మహారాష్ట్ర, గుజరాత్‌లో కూడా ఇలాగే క్లస్టర్లలో పరిశ్రమలకు భూములకు సంబంధించి ధరలు ఖరారు చేశారు. గుజరాత్, ముంబైలో ఎకార రూ.2.25 కోట్లకు ఫిక్స్ చేశారు. పారిశ్రామికవేత్తల నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదని చెబుతున్నారు.రాష్ట్రంలోని ఇండస్ట్రియల్ నోడ్‌లకు సమీపంలో ఎకరా రూ.20 నుంచి 30 లక్షలకు భూములు అందిస్తున్నట్లు కేంద్రం దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. ఈ ధరలతో పోలిస్తే ఇండస్ట్రియల్ నోడ్‌లలో భూముల ధరలు 3 నుంచి 4 రెట్లు ఎక్కువగా ఉందని గుర్తు చేశారు. దీంతో కేంద్రం ఈ నోడ్‌లలో ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తునందున ఈ ఖర్చును భరించి రాబట్టేందుకు వీలుగా కేంద్రం ధరల్ని ఫిక్స్ చేసింది. కాకపోతే ముందుకుగా వచ్చే ప్రాజెక్టులకు మాత్రం 25శాతం రాయితీ ఇచ్చేందుకు అనుమతించింది.. అది కూడా ప్రోత్సాహకం కింద ఇస్తారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఇండస్ట్రియల్ కారిడార్లకు సంబంధించిన భూముల్ని ఏ ధరకు విక్రయించాలో తమ నిర్ణయానికి అనుగుణంగా వ్యవహరించాలని, ఐఆర్ఆర్‌కు సంబంధించి కేంద్రం నిబంధన విధించింది.. ఈ ధరలకే భూములు విక్రయించాల్సి ఉంటుందంటున్నారు అధికారులు.క్రిస్ సిటీలో ముందుగా ఈ భూములు కేటాయింపు ప్రారంభించాలని ప్లాన్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొప్పర్తి, ఓర్వకల్లు, కృష్ణపట్నం నోడ్‌లలో కలిపి దశల వారీగా 29,254 ఎకరాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోంది. రాష్ట్రం భూముల్ని కేటాయిస్తే.. కేంద్ర సంస్థ నిక్‌డిక్ట్ (నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్) అభివృద్ధి చేస్తోంది. మూడు నోడ్‌లలో కలిపి మొదటి దశలో భాగంగా మౌలిక సదుపాయాలకు మొత్తం 7,225 ఎకరాల్లో దాదాపు రూ.3,300 కోట్లు నిక్‌డిక్ట్ ఖర్చు చేస్తోంది.

## అడ్డంగా బుక్కైన కాటసాని

**కర్నూలు,(భారత శక్తి)** నంద్యాల జిల్లాలో వైసీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి భూకబ్జా ఉదంతం తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తనకున్న రాజకీయ పలుకుబడిని ఉపయోగించి.. ఏకంగా రూ.15 కోట్ల విలువైన 3 ఎకరాల ప్రభుత్వ భూమిని కాటసాని రామిరెడ్డి అక్రమంగా ఆక్రమించుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. నాటి అధికార మదంతో ప్రభుత్వ ఆస్తులను సైతం వదలకుండా కాటసాని అనుచరులు కబ్జాకు పాల్పడ్డారనే విమర్శలు ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి.ఈ భారీ భూకబ్జా పర్వంలో కేవలం రాజకీయ నాయకులే కాకుండా.. ప్రభుత్వానికి రక్షణగా ఉండాల్సిన అధికారులే లంచాలకు ఆశపడి చేతులు కలిపినట్లు తెలుస్తోంది. అప్పట్లో కాటసాని రామిరెడ్డి అక్రమాలకు ఇరిగేషన్ మరియు రెవెన్యూ శాఖలకు చెందిన కొందరు కీలక అధికారులు పూర్తి స్థాయిలో సహకరించారని విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ భూమి అని తెలిసి కూడా రికార్డులను తారుమారు చేయడం లేదా కబ్జా జరుగుతున్నా కళ్లు మూసుకోవడం ద్వారా ఈ అక్రమ ఆక్రమణకు వారు బాటలు వేశారనే ఆరోపణలు వినపడుతున్నాయి.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పలు అవినీతి అక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగానే కాటసాని రామిరెడ్డి చేసిన ఈ భూకబ్జా వ్యవహారంపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, విచారణ జరపగా.. సదరు 3 ఎకరాల ప్రభుత్వ భూమిని కాటసాని ఆక్రమించిన మాట వాస్తవమేనని తేల్చేశారు. విజిలెన్స్ నివేదికతో కాటసాని అక్రమాలు అధికారికంగా బట్టబయలయ్యాయి.విజిలెన్స్ విచారణలో ఆక్రమణలు నిజమేనని తేలడంతో ఏపీ కూటమి ప్రభుత్వం అత్యంత తీవ్రంగా స్పందించింది. రూ.15 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని తక్షణమే స్వాధీనం చేసుకోవాలని, ఆక్రమణలను తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. భూకబ్జాకు పాల్పడ్డ వైసీపీ నేత కాటసాని రామిరెడ్డిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు.. అప్పట్లో ఆయనకు అండగా నిలిచి లూటీకి సహకరించిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులపై కూడా శాఖాపరమైన మరియు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.

### హైడ్రాను రద్దు చేయాలని

## భారీ ర్యాలీ

**(భారత శక్తి)** హైడ్రా నుంచి తమ బస్తీని కాపాడాలని ఖైరతాబాద్‌లోని ఎంఎస్ మక్తా, బీఎస్ మక్తా బస్తీవాసులు శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. నెక్లెస్ రోడ్డును ఆనుకొని ఉన్న బస్తీలను హైడ్రా పేరుతో తొలగిస్తారని ప్రచారాలు జరగడంతో బస్తీ వాసును ప్లా కార్డులు పట్టుకొని భారీ ఎత్తున ఆందోళన నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు

# 68 మండలాల్లో డేంజర్


**విజయవాడ(భారత శక్తి)** ఏపీలో వర్షాభావం కనిపిస్తోంది. జూలై రెండవ వారం దాటుతున్న ఆశించిన స్థాయిలో వర్షాలు పడడం లేదు. సాగునీటి జలాశయాలు, ప్రాజెక్టుల్లో నీరు లేదు. డెడ్ స్టోరేజ్ కు చేరుకున్నాయి నిల్వలు. మరోవైపు ఖరీఫ్ సీజన్ కూడా ప్రారంభమైంది కానీ.. వర్షాలు లేక ఆశించిన స్థాయిలో పనులు ముందుకు వెళ్లడం లేదు. అల్పపీడనం ప్రభావంతో అక్కడక్కడ వర్షాలు పడ్డాయి కానీ.. ప్రస్తుతానికి ముఖం చాటేసాయి. వరి విత్తనాలు చల్లి వర్షం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు అన్నదాతలు. ప్రస్తుతం పరిస్థితి చూస్తుంటే మాత్రం ఖరీఫ్ ప్రమాదకరమే అని అర్థం అవుతోంది. ఈ తరుణంలో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమయింది. ఈ వాతావరణ విపత్తుని ఎదుర్కొనేందుకు సన్నద్ధం అవుతోంది.ప్రధానంగా ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరించింది. అది మన రాష్ట్రంపై స్పష్టంగా కనిపించింది. నైరుతి రుతుపవనాల రాక కూడా ఆలస్యం అయ్యింది. జూన్ రెండో వారానికి రాష్ట్రానికి రుతుపవనాలు తాకాయి. తీవ్ర వర్షాభావం నెలకొంది. వర్షపాతం లోటు కనిపిస్తోంది. జూన్లో మైనస్ 25 వర్షపాతం లోటు నమోదు కాగా.. జూలైలో ఇప్పటివరకు మైనస్ 41 శాతం వర్షపాతం లోటు నమోదయింది. సాధారణంగా జూన్ నుంచి నవంబర్ వరకు నైరుతీ రుతుపవనాలు విస్తరిస్తాయి. ఖరీఫ్ కు ఇవే ప్రధానం. ఈ సీజన్ మొత్తం మైనస్ 27% వర్షపాతం లోటుతో ముగిసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.ఉమ్మడి 13 జిల్లాల్లో 68 మండలాలు ఉన్నాయి. అందులో ఎల్ నినో ప్రభావం 105 మండలాలపై తీవ్రంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. 208 మండలాలపై మాత్రం మధ్యస్థ స్థాయిలో ప్రభావం ఉండనుంది. ప్రధానంగా శ్రీ సత్య సాయి, అన్నమయ్య, అనంతపురం జిల్లాలపై ప్రభావం ఉండనుంది. మధ్యస్థ స్థాయి ప్రభావం కర్నూలు, నంద్యాల, చిత్తూరు, వైయస్సార్ కడప, తిరుపతి, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు జిల్లాలపై ఉండనుంది. నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమయింది. ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయ శాఖ కీలక సూచనలు చేస్తోంది.

### ఉరుములు, పిడుగులు.. ఆ జిల్లాలకు హై అలెర్ట్!

ఏపీ వ్యాప్తంగా చల్లటి వాతావరణం కొనసాగుతోంది. అక్కడక్కడ వర్షాలు పడుతున్నాయి. కానీ పూర్తిస్థాయిలో మాత్రం కురవడం లేదు. ఇంకా వర్షపాతం లోటు కనిపిస్తోంది. ఇటువంటి సమయంలో ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెదర్ అప్డేట్ ఇచ్చింది. నాలుగు జిల్లాల్లో మోస్తరు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వానలు పడతాయని తెలిపింది. అయితే భారీ వర్షాలు నమోదు కావడం లేదు. ఎల్ నినో ప్రభావం స్పష్టంగా ఉంది. ఖరీఫ్ అదును దాటుతుండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇదే పరిస్థితి మరికొన్ని రోజులపాటు కొనసాగితే ఇబ్బందికర పరిస్థితులు తప్పేలా లేవు. అయితే నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతుండడంతో కొంత ఆశలు రేగుతున్నాయి.ఐదు రోజులపాటు నైరుతీ రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈరోజు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం జిల్లాల్లో చెదురు మధురుగా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేస్తోంది. మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే ఛాన్స్ కనిపిస్తోంది. పిడుగులు పడే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచిస్తున్నారు. రైతులతోపాటు పశువుల కాపర్లు జాగ్రత్తగా ఉండాలని సూచనలు చేస్తున్నారు.ఏపీ పై ఎల్ నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం తేలికపాటి వర్షాలు తప్ప.. భారీ వర్షాలు నమోదు కావడం లేదు.

నైరుతి రుతుపవనాలు సైతం ఆలస్యం అయ్యాయి. పెద్దగా ప్రభావం సైతం కనిపించడం లేదు. ఖరీఫ్ పంటలపై ప్రభావం కనిపిస్తోంది. ఈ ఏడాది ఇలానే కొనసాగితే కష్టం అని రైతుల్లో ఒక రకమైన ఆందోళన నెలకొంది. మరోవైపు ఎల్ నినో హెచ్చరికల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. ప్రత్యామ్నాయ పంటలను సూచించింది. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ శాఖ అధికారులు ఈ పంటలపై సూచనలు అందిస్తున్నారు. ప్రధానంగా రాయలసీమ జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాలో వర్షపాతం లోటు ఉంటుందని ముందుగానే అంచనా వేశారు. కానీ రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఆకాశం మేఘావృతమై కనిపించినా.. వర్షాలు ఆశించిన స్థాయిలో కురవడం లేదు. ఇది కచ్చితంగా రైతులకు లోటు.

# వైసీపీ, టీడీపీ మధ్య సవాళ్లు



**కర్నూలు(భారత శక్తి)** ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆళ్లగడ్డ నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. అధికార తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి మధ్య ఆరోపణలు, సవాళ్లతో రాజకీయ చర్చలు మరింత ముదిరాయి. ఇద్దరు నాయకులు బహిరంగంగా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడంతో ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది.అహోబిలం ఆలయానికి సంబంధించిన వ్యవహారాల్లో అవినీతి చోటుచేసుకుందని బ్రిజేంద్రరెడ్డి ఆరోపించారు. భక్తులు సమర్పించే తలనీలాలు, కానుకలు వంటి అంశాల్లో అక్రమాలు జరుగుతున్నాయని, వాటికి అధికార వర్గాల మద్దతు ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రతి నెలా అక్రమ లావాదేవీలు జరుగుతున్నాయని కూడా ఆయన విమర్శించారు.ఈ ఆరోపణలపై స్పందించిన అఖిలప్రియ వాటిని పూర్తిగా ఖండించారు. తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని స్పష్టం చేశారు. తమ కుటుంబం ఎప్పటి నుంచో దేవాలయాలు, మఠాలకు విరాళాలు అందిస్తోందని, ఆధ్యాత్మిక సంస్థలను దోచుకునే సంస్కృతి తమకు లేదని చెప్పారు. గతంలో అధికారంలో ఉన్నవారే ఇప్పుడు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆమె ఎదురుదాడి చేశారు.అంతేకాకుండా, తనపై చేసిన ఆరోపణలను ఆధారాలతో నిరూపించాలని బ్రిజేంద్రరెడ్డికి సవాల్ విసిరారు. అవి నిజమని తేలితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడానికి కూడా సిద్ధమని ప్రకటించారు. అదే సమయంలో ఆరోపణలను నిరూపించలేకపోతే ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ప్రత్యర్థి నేతను డిమాండ్ చేశారు.ఈ సవాల్‌కు ప్రతిస్పందించిన బ్రిజేంద్రరెడ్డి కూడా తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, సరైన సమయంలో వాటిని ప్రజల ముందుకు తీసుకొస్తానని తెలిపారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం మరింత తీవ్రమైంది. ఈ వివాదానికి అహోబిలాన్ని వేదికగా ఎంచుకోవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. అఖిలప్రియ ఆళ్లగడ్డ నుంచి అహోబిలానికి చేరుకుని అక్కడే ఉంటానని ప్రకటించారు. మరోవైపు బ్రిజేంద్రరెడ్డి కూడా అక్కడికి వెళ్లేందుకు సిద్ధమవగా, పరిస్థితులు ఉద్రిక్తంగా మారే అవకాశం ఉందని భావించిన పోలీసులు ఆయనను గృహనిర్బంధంలో ఉంచినట్లు సమాచారం. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.ఆళ్లగడ్డ రాజకీయాలు గతంలో కూడా ఎన్నో సంచలనాలకు కేంద్రంగా నిలిచాయి. ఇప్పుడు మరోసారి ఇద్దరు ప్రధాన నాయకుల మధ్య నేరుగా సవాళ్లు, ప్రతి సవాళ్లు సాగడంతో స్థానిక రాజకీయాలు మరింత వేడెక్కాయి. అయితే అహోబిలం చర్చకు వచ్చేందుకు గంగుల బ్రిజేంద్రనాథ్ రెడ్డి తన ఇంటి నుంచి బయలుదేరారు. కానీ శాంతి భద్రతల సమస్య దృష్ట్యా పోలీసులు ఆయనను ఇంటి బయటకు రాకుండా అడ్డుకున్నారు. గంగుల బ్రిజేంద్రనాథ్ రెడ్డి తో పాటు ఆయన అనుచరులు కూడా తమను అహోబిలం వెళ్లేందుకు అనుమతివ్వాలని పోలీసులను కోరారు. పోలీసులు అందుకు అంగీకరించకపోవడంతో అఖిలప్రియకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికలకు ఇంకా మూడేళ్లు ముందు నుంచే ఆళ్లగడ్డ రాజకీయం హీటెక్కింది. గంగుల బ్రిజేంద్రనాథ్ రెడ్డి వర్సెస్ భూమా అఖిలప్రియగా వార్ మొదలయింది. ఇప్పుడే ఇలా ఉంటే.. రానున్న కాలంలోఇంకెన్ని వివాదాలు తలెత్తుతాయోనన్న ఆందోళన ఆళ్లగడ్డ ప్రజల్లో నెలకొంది. మొత్తం మీద కేవలం రాజకీయ ఆధిపత్యం కోసమే ఇలాంటి ఆరోపణలు చేసుకుంటున్నారంటూ సొంత పార్టీ నేతలే కామెంట్స్ చేస్తున్నారు. వ్యవహారం ఎలా ముగుస్తుందో, ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు బయటకు వస్తాయో అన్న అంశంపై రాజకీయ వర్గాలతో పాటు ప్రజల్లో కూడా ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం ఇరు పార్టీల కార్యకర్తలు తమ తమ నాయకులకు మద్దతుగా నిలుస్తుండటంతో పరిస్థితిని అధికారులు నిశితంగా గమనిస్తున్నారు.

# ఆరణి శ్రీనివాసులుకు కష్టాలు

**తిరుపతి,(భారత శక్తి)** తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు కష్టాలు మొదలయినట్లు కనిపిస్తుంది. వచ్చే ఎన్నికల్లో ఆయనకు తిరుపతి శాసనసభ టిక్కెట్ దక్కేది కూడా కష్టంగానే కనిపిస్తుంది. తెలుగుదేశం పార్టీ నుంచి ఆరణి శ్రీనివాసులకు ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురవుతున్నాయని చెప్పాలి. తాజాగా టీడీపీ అధినాయకత్వం తిరుపతి ఇన్ ఛార్జిగా మన్నెం శ్రీనివాస్ ప్రసాద్ ను నియమించడంతో ఈ ఊహాగానాలకు మరింత ఊపు నిచ్చినట్లయింది. ఇప్పటి వరకూ తిరుపతి టీడీపీ ఇన్ ఛార్జిగా ఉన్న సుగుణమ్మను తప్పించి ఆమె స్థానంలో మన్నెం శ్రీనివాస్ ప్రసాద్ ను నియమించడం వెనక వచ్చే ఎన్నికల్లో శ్రీనివాస్ ప్రసాద్ ను పోటీకి దింపాలన్న యోచనలోనే టీడీపీ నాయకత్వం ఉందన్నది పార్టీ వర్గాల ద్వారా విస్తృతంగా సోషల్ మీడియాలో ప్రచారం అవుతుంది. 2019లా వైసీపీ నుంచి గెలిచిన ఆరణి శ్రీనివాసులు 2024 ఎన్నికల్లో జనసేనలోచేరారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆరణి శ్రీనివాసులకు తిరుపతి నియోజకవర్గం టిక్కెట్ ఇచ్చారు. టీడీపీ బలంగా ఉన్నప్పటికీ, అక్కడ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తనకు కావాలని గట్టిగా కోరినప్పటికీ పవన్ కల్యాణ్ తిరుపతి నియోజకవర్గం సీటును పట్టుబట్టి జనసేన ఖాతాలో వేసుకున్నారు కూటమి హవాలో ఆరణి శ్రీనివాసులు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. వైసీపీ నుంచి జనసేనలోకి గతంలో చిత్తూరు ఎమ్మెల్యేగా వైసీపీలో ఉన్న ఆయన పార్టీ మారి తిరుపతి జనసేన ఎమ్మెల్యే అయ్యారు. కానీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆరణి శ్రీనివాసులు పార్టీ క్యాడర్ ను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. టీడీపీ, జనసేన క్యాడర్ ను పక్కన పెట్టి కొందరు వైసీపీ నేతలకు టచ్ లో ఉన్నారంటూ ఆరో?పణలు పలు దఫాలు ఎదుర్కొన్నారు. అలాగే సుగుణమ్మ కూడా జనసేన నేతలతో సమన్వయం చేసుకోవడంలో విఫలమయ్యారని టీడీపీ నాయకత్వం భావించింది. జనసేన నాయకులే ఆరణి శ్రీనివాసులుపై ఆరోపణలు చేస్తున్నారు. వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలకు కూడా ధీటుగా ఆరణి శ్రీనివాసులు స్పందించక పోవడం కూడా ఆరణిపై ఆగ్రహానికి కారణమయిందంటున్నారు. కొంతకాలం క్రితం తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ క్లాస్ పీకారని తెలిసింది. ఇలాగైతే ఎలా.. కూటమిలోని మూడు పార్టీల కార్యకర్తలను కలుపుకుని పోవాలని పవన్ కల్యాణ్ చెప్పారట. పాత పరిచయాలుంటే వాటిని వదిలేయాలని, జనసేనలో కొనసాగాలనుకుంటే మారాలని ఆరణి శ్రీనివాసులుకు పవన్ కల్యాణ్ ఒకింత సీరియస్ గానే చెప్పినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే వచ్చే ఎన్నికలు మూడేళ్లకు ముందుగానే టీడీపీ ఇన్ ఛార్జిగా మన్నెం శ్రీనివాస్ ప్రసాద్ ను పార్టీ నాయకత్వం నియమించినట్లు తెలిసింది.

### గ్రేటర్ రాయలసీమపై గురి

జనసేనలో చేరికలు పెరిగే అవకాశం కనిపిస్తోంది. ప్రధానంగా గ్రేటర్ రాయలసీమ పరిధిలోని ఆరు ఉమ్మడి జిల్లాల నుంచి భారీగా వైసీపీ నేతలు జనసేనలో చేరుతారని ప్రచారం ప్రారంభం అయింది. చాలామంది వైసిపి నేతలు అసంతృప్తితో ఉన్నారు. అటువంటి వారంతా జనసేన వైపు చూస్తున్నట్లు తెలుస్తోంది. వారిని పార్టీలోకి రప్పించేందుకు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి రంగంలోకి దిగినట్లు సమాచారం. ఇటీవల 14 మంది జనసేన నేతలతో చేరికల కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అందులో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి కూడా ఒకరు. ఆయనకు గ్రేటర్ రాయలసీమ జిల్లాలపై మంచి పట్టు ఉంది. కాంగ్రెస్ పార్టీతో పాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆయన పని చేశారు. ఆ అనుభవంతోనే పెద్ద ఎత్తున వైసిపి నేతలను ఆకర్షించేందుకు ఆయన ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు గెలుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై అసంతృప్తి ఉన్నవారు, వీధి లేక పార్టీలో కొనసాగుతున్న వారిని టార్గెట్ చేసుకున్నట్లు తెలుస్తోంది.గ్రేటర్ రాయలసీమ పరిధిలో కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, ప్రకాశం జిల్లాలో ఉన్నాయి. దాదాపు 70 వరకు నియోజకవర్గాలు ఉంటాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆది నుంచి గ్రేటర్ రాయలసీమ అనుకూలంగా ఉంటూ వస్తోంది. 2014 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వచ్చింది. కానీ గ్రేటర్ రాయలసీమలో మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టు చాటుకుంది. 2019 ఎన్నికల్లో మాత్రం ఒక ఐదు స్థానాలు మినహా మిగిలిన నియోజకవర్గాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయదుందుభి మోగించింది. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభంజనంలో సైతం వైయస్సార్ కాంగ్రెస్ ఏడు స్థానాల్లో విజయం సాధించింది. మూడు ఎంపీ సీట్లను పొందింది. అందుకే అక్కడ వైసిపిని తక్కువ అంచనా వేయకూడదని చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు. అందుకే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డిని రంగంలోకి దించినట్లు తెలుస్తోంది.బాలినేని శ్రీనివాస్ రెడ్డి తన సొంత జిల్లా ప్రకాశం నుంచి జనసేన చేరికల విషయంలో ప్రత్యేక ఫోకస్ పెట్టినట్లు సమాచారం. జిల్లాలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ఓ నలుగురు జనసేనలోకి వస్తారని టాక్ నడుస్తోంది. ప్రధానంగా కరణం బలరాం, సిద్ధ రాఘవరావు, ఆమంచి కృష్ణమోహన్ తో పాటు మరొకరి పేరు ప్రధానంగా వినిపిస్తోంది. వారంతా తెలుగుదేశం పార్టీలో చేరేందుకు ప్రయత్నాలు చేశారు.
కానీ వర్కౌట్ కాలేదు. నియోజకవర్గాల పునర్విభజన కచ్చితంగా ఉంటుందన్న టాక్ ఉంది. పెరిగిన అసెంబ్లీ నియోజకవర్గాలతో అవకాశాలు కల్పిస్తామని కూటమి నుంచి వారికి హామీలు దక్కుతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా రాయలసీమ జిల్లాల్లో చాలామంది వైసిపి మాజీ ఎమ్మెల్యేలు జనసేనలోకి వచ్చేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జనసేన చేరికల కమిటీ చాలా యాక్టివ్ గా పని చేయడం ప్రారంభించింది. సహజంగానే ఈ పరిణామం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆందోళన కలిగిస్తోంది.

### బీజేపీ నేతల మౌనం

# ఎందుకో..

**విశాఖపట్టణం,(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ బీజేపీలో ఏదో జరుగుతుంది. ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ పెద్దగా రాజకీయంగా యాక్టివ్ గా లేకపోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వంపై ప్రత్యర్థులు విమర్శలు చేస్తున్నప్పటికీ దానికి సరైన కౌంటర్ మాత్రం ఇవ్వడం లేదు. బీజేపీ నేతల మౌనం వెనక అర్థం ఏంటన్నది ఇప్పటికీ కూటమిలోని ప్రధాన పక్షాలైన టీడీపీ, జనసేనలకు అర్థం కాకుండా ఉంది. రాష్ట్ర నేతలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారా? లేదా కేంద్ర నాయకత్వం నుంచి ఏమైనా ఆదేశాలు ఉన్నాయా? అన్న అనుమానం అందరిలోనూ కలుగుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు పూర్తి కావస్తున్నప్పటికీ కమలం పార్టీ రాష్ట్ర నేతలు మాత్రం సంతోషంగా లేరు. తమ నియోజకవర్గాల్లో... అనేక నియోజకవర్గాల్లో తాము ప్రాతినిధ్యం వహిస్తున్న చోట టీడీపీ, జనసేన నుంచి తమకు మద్దతు లభించడం లేదని రివర్స్ లో బీజేపీ నేతలు ఈ విధమైన నిరాసక్తతతో ఉన్నారని చెబుతున్నారు. మొన్నటి ఎన్నికల్లో బీజేపీ పది స్థానాల్లో పోటీ చేసింది. ఎనిమిది స్థానాల్లో విజయం సాధించింది. అలాగే ఆరు లోక్ సభ స్థానాలకు పోటీ చేసి మూడింటిలోవిజయం సాధించింది. అనపర్తి నుంచి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి , కైకలూరు నుంచి కామినేని శ్రీనివాస్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి సుజనా చౌదరి, ఆదోని నుంచి డా. పి.వి. పార్థసారథి, జమ్మలమడుగు నుంచి ఆదినారాయణ రెడ్డి, ధర్మవరం నుంచి సత్య కుమార్ యాదవ్, ఎచ్చెర్ల నుంచి నడుకుదిటి ఈశ్వరరావు ఎన్నికయ్యారు. విశాఖపట్నం ఉత్తరం నుంచి పెన్మెత్స విష్ణు కుమార్ రాజులు ఎన్నికయ్యారు. రాజమండ్రి పార్లమెంటు నుంచి దగ్గుబాటి పురంధేశ్వరి, అనకాపల్లి సీఎం రమేష్, నర్సాపురం నుంచి భూపతిరాజు శ్రీనివాసవర్మలు ఎన్నికయ్యారు. దీంతో పాటు మాధవ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు... కానీ ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలున్నప్పటికీ ఎవరూ పెద్దగా స్పందించడం లేదు. అసలు కూటమి ప్రభుత్వంతో తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వం పై వస్తున్న ఆరోపణల విషయంలోనూ పెద్దగా స్పందించడం లేదు. ఇందుకు ప్రధాన కారణం.. కూటమి సర్కార్ లో తమకు ప్రాధాన్యత దక్కకపోవడం ఒక కారణమయితే, మరొక ముఖ్యమైన కారణం.. తమ నియోజకవర్గాల్లో టీడీపీ ఇన్ ఛార్జుల పెత్తనం సాగుతుండటమేనని చెబుతున్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని కేంద్ర నాయకత్వానికి కొందరు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అయితే సంయమనం పాటించాలని, రానున్న కాలంలో అంతా సర్దుకుంటుందని నాయకత్వం చెప్పిందట. అయినా సరే కూటమిలో మిత్రధర్మం పాటించకుండా వ్యవహరించడంపై టీడీపీ, జనసేనలో కొంత అసంతృప్తి అయితే మొదలయింది. తెలుగు రాష్ట్రాల్లో వర్షాభావం, రుతుపవనాల లోపం వల్ల వ్యవసాయానికి తీవ్ర ఆటంకం కలిగి కరవు పరిస్థితులు ఏర్పడ్డాయి.

### నంబర్ ప్లేట్ లేని, నిబంధనలకు విరుద్ధమైన వాహనాలపై మహబూబ్ నగర్ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక తనిఖీలు

**(భారత శక్తి)**జిల్లా ఎస్పీ డి.జానకి, ఆదేశాల మేరకు నెంబర్ ప్లేట్స్ లేని ద్విచక్ర వాహనాలను శుక్రవారం మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కె.రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు లేకుండా లేదా అస్పష్టంగా, కొన్ని అంకెలు తొలగించి తిరుగుతున్న వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వాహనదారులను ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సిలింగ్ నిర్వహించి, మోటారు వాహనాల చట్టం ప్రకారం జరిమానాలు విధించారు. అనంతరం ఆయా వాహనాలకు నిబంధనలకు అనుగుణంగా సరైన రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేయించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కె.రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, కొంతమంది వాహనదారులు ట్రాఫిక్ చలాన్ల నుంచి తప్పించుకోవడం లేదా చైన్ స్నాచింగ్‌లు, ఇతర నేరాలకు పాల్పడినప్పుడు గుర్తింపు తప్పించుకునే ఉద్దేశంతో నంబర్ ప్లేట్లు లేకుండా లేదా నంబర్లను మార్పులు చేసి వాహనాలను నడుపుతున్నట్లు గుర్తిస్తున్నామని తెలిపారు. ఇటువంటి చర్యలు చట్టవిరుద్ధమని, నేరాలకు పాల్పడిన వారిని గుర్తించడంలో తీవ్ర ఇబ్బందులు కలిగిస్తాయని పేర్కొన్నారు.అందువల్ల ప్రతి వాహనదారు తమ వాహనాలకు నిబంధనలకు అనుగుణంగా స్పష్టంగా కనిపించే రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని సూచించారు.

# తాళాలు పగలగొట్టి చోరీలు

## నలుగురు దొంగల అరెస్ట్

- వేములవాడ పోలీసుల యాక్షన్.. నిందితుల నుంచి సొత్తు స్వాధీనం.
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీనివాసులు.



**భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూలై 10:** ఇంటి తాళాలు పగలగొట్టి వరుస చోరీలకు పాల్పడుతున్న నలుగురు సభ్యుల దొంగల ముఠాను వేములవాడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు వెల్లడించారు.పోలీసుల కథనం ప్రకారం.. వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల కాలంలో తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా కొన్ని దొంగతనాలు జరిగాయి. దీనిపై ప్రత్యేక నిఘా పెట్టిన పట్టణ పోలీసులు.. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించడంతో ఈ చోరీల గుట్టు రట్టయింది. అరెస్టయిన వారిలో సిరిసిల్ల పట్టణం బి.వై.నగర్‌కు చెందిన ఆడెపు రవి అలియాస్ చోరు రవి (25, పెయింటర్), ఈగ కృష్ణ (27)లతో పాటు కొనరావుపేట మండలం కొలనూర్ గ్రామానికి చెందిన గాజులవేణి అరుణ్ కుమార్ (23), కొనరావుపేట గ్రామానికి చెందిన గాజుల హేమంత్ (20) ఉన్నారు. నిందితుల నుంచి చోరీ సొత్తును రికవరీ చేసి, వారిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసులు ప్రజలకు పలు సూచనలు చేశారు. ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో ప్రజలు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎక్కువ రోజులు ఊళ్లకు వెళ్లేటప్పుడు సమీప బంధువులకు లేదా నమ్మకమైన పొరుగువారికి సమాచారం అందించాలన్నారు. కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు గమనిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు గానీ, లేదా డయల్-100కు గానీ సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతోనే నేరాలను పూర్తిగా అదుపు చేయగలమని ఆయన పేర్కొన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పట్టణ పోలీసులను డీఎస్పీ అభినందించారు.

## ఆలేరు నియోజకవర్గంలో పలు పిఏసిఎస్‌లకు నూతన పాలకమండళ్ల నియామకం




**భారత శక్తి, జూలై 10 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు (ప్యాక్స్) నూతన పాలక మండళ్లను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రైతు సంక్షేమం, సహకార వ్యవస్థ బలోపేతం, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ ఈ నియామకాలు చేపట్టినట్లు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలోని బొమ్మలరామారం పిఏసిఎస్ కు సింగిర్తి మల్లేశం, తుర్కపల్లి పిఏసిఎస్ కు ధనావత్ శంకర్ నాయక్, యాదగిరిగుట్ట పిఏసిఎస్ కు చీర శ్రీశైలం, రాజపేట పిఏసిఎస్ కు నమిల మహేందర్, ఆలేరు పిఏసిఎస్ కు జనగాం ఉపేందర్ రెడ్డి, ఆత్మకూరు పిఏసిఎస్ కు యాస లక్ష్మారెడ్డి, గుండాల పిఏసిఎస్ కు అండెం సంజీవరెడ్డిలను నియమించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ రైతు సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని సహకార సంఘాల ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నియామకాలు చేపట్టిందన్నారు.

ఈ నియామకాలకు ఆమోదం తెలిపిన సిఎం రేవంత్ రెడ్డి, సహకార శాఖ మంత్రి, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే నూతనంగా నియమితులైన చైర్మన్లు, డైరెక్టర్లు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ రైతుల సంక్షేమానికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. రైతులకు ఎరువులు, విత్తనాలు, పంట రుణాలు, ఇతర సహకార సేవలను పారదర్శకంగా అందించి సహకార సంఘాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టనున్న పిఏసిఎస్ చైర్మన్లు, డైరెక్టర్లందరికీ ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి పదవీకాలంలో రైతులకు విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# ఈవీఎం గోదాం తనిఖీ చేసిన

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జులై 10( భారత శక్తి): కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని సాధారణ తనిఖీల్లో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను పరిశీలించారు. చేశారు. సీసీ కెమెరాల పనితీరు చూశారు. అగ్నిమాపక వ్యవస్థ పనితీరు తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది నిరంతరం సీసీ కెమెరాలు పర్యవేక్షణతో మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. సిబ్బంది పటిష్ట అగ్నిమాపక వ్యవస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అగ్నిమాపక అధికారి శివాజీ, తహసిల్దార్ రాజు, అధికారులు స్వాతి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బీబీనగర్ ఏయిమ్స్‌ను సందర్శించిన

# కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపి నడ్డా

- పదేళ్లలో సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ గా బీబీనగర్ ఏయిమ్స్ - ఏయిమ్స్ లో ప్రతిరోజూ వేల మందికి ఓపి సేవలు: కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జెపి నడ్డా





భారత శక్తి, జూలై 10(యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి): గతంలో కేవలం ఢిల్లీలో మాత్రమే ఒక్క ఎయిమ్స్ ఉండేదని, వాజపేయి కాలంలో 5 ఎయిమ్స్ లు వచ్చాయి మళ్లీ 2014లో కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చాక తరువాత 23 ఎయిమ్స్ లు కొత్తగా వచ్చాయని కేంద్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ మంత్రి జేపి నడ్డా అన్నారు. గురువారం బీబీనగర్ ఎయిమ్స్ (ఛా××మీా) అభివృద్ధి మరియు పనుల పురోగతిపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా నేతృత్వంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి జెపి నడ్డా బీబీనగర్ ఏయిమ్స్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 లో బీబీనగర్ ఎయిమ్స్ కు అనుమతి లభించిందని, వెయ్యి కోట్లతో బీబీనగర్ ఎయిమ్స్ నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. ఇందులో 24 శాఖలు ఉన్నాయని, ఇప్పటికే రెండు ఎంబీబీఎస్ మెడికల్ బ్యాచ్ లు వెళ్ళాయని తెలిపారు. బీబీనగర్ ఎయిమ్స్ లో రోజుకు 1800 మంది ఔట్ పేషెంట్లకు వైద్య సేవలతో పాటు అత్యవసర సేవలు అందుతున్నాయని, అవసరమైన వారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. టెలి మేడిసిన్ సేవలు కూడా అందుబాటులో ఉందని లక్షల మందికి పైగా ఈ సేవలు వినియోగించుకున్నట్లు తెలిపారు. పరిశోధన రంగానికి 64 కోట్లు మంజూరు చేశామని, 128 ప్రాజెక్టులు నడుస్తున్నాయని వెయ్యికి పైగా పబ్లికేషన్లు జరిగాయన్నారు. బీబీనగర్ ఏయిమ్స్ లో దేశంలోనే తొలిసారి కమ్యూనిటీ రేడియో స్టేషన్ ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటివరకు 547 మెడికల్ క్యాంపులు నిర్వహించారని తెలిపారు. ఎయిమ్స్ నిర్మాణ పనులు 87% పూర్తి అయ్యాయని మిగిలిన పనులు త్వరలో పూర్తయ్యేలా చూస్తామని, బీబీనగర్ ఎయిమ్స్ ఆసుపత్రి సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ గా అవుతుందన్న నమ్మకం ఉందని అన్నారు. ఈ ఆసుపత్రికి పూర్తి స్థాయిలో టీచింగ్ సిబ్బంది ఉందని, అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని ఈ 10 ఏళ్లలో బాగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. కార్పొరేట్ స్థాయిలో రోగులకు వైద్య సేవలు అందుతున్నాయని అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంపిలు డాక్టర్ కె. లక్ష్మణ్, డి.కె. అరుణ, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎయిమ్స్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ 'ఎఫ్‌సివి' పొగాకు మార్కెటింగ్ సీజన్‌పై వాణిజ్య మంత్రిత్వ శాఖ సమీక్ష

- పొగాకు రైతు ప్రయోజనాల పరిరక్షణపై నిబద్ధతను పునరుద్ఘాటించిన కమిటీ







**హైదరాబాద్, జూలై 10(భారత శక్తి ):**ఆంధ్రప్రదేశ్ 'ఎఫ్‌సివి' పొగాకు మార్కెటింగ్ సీజన్ (2025--26)పై కేంద్ర వాణిజ్య-పరిశ్రమల మంత్రిత్వశాఖ ఈ రోజు హైదరాబాద్‌లో సమీక్షించింది. ఈ మేరకు పొగాకు రైతులు, తయారీదారులు, ఎగుమతిదారులు, డీలర్లు, వాణిజ్య సంఘాలు - పొగాకు బోర్డుతో వాణిజ్య శాఖ అదనపు కార్యదర్శి నితిన్ కుమార్ యాదవ్, ఐఏఎస్ నేతృత్వంలోని బృందం చర్చించింది. ఈ సందర్భంగా ప్రస్తుత మార్కెట్ పరిస్థితిని సమీక్షించిన అనంతరం, రైతు ప్రయోజనాల పరిరక్షణపై తమ నిబద్ధతను పునరుద్ఘాటించింది. అలాగే, పొగాకు కొనుగోళ్లను వేగిరపరచేందుకు, ఎగుమతుల సౌలభ్య కల్పనకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించింది. పొగాకు బోర్డు పునర్నిర్మాణం, రైతుల సంక్షేమ నిధి ప్రయోజనాల పెంపు, రిజిస్ట్రేషన్ విధానాల సరళీకరణ, డిజిటల్ కార్యక్రమాలు, ఏఐ ఆధారిత గ్రేడింగ్ తదితరాలపైనా సమావేశం సమీక్షించింది. వివిధ దేశాలకు ఎగుమతి సంబంధిత మార్కెట్ అవకాశాల విస్తరణ సహా అనువైన ప్రాంతాల్లో పంటల వైవిధ్యీకరణపైనా ఈ బృందం చర్చించింది. సంబంధిత వర్గాలన్నింటితో సమన్వయం దిశగా భారత 'ఎఫ్‌సివి' పొగాకు రంగం దీర్ఘకాలిక సుస్థిరత, ప్రపంచ పోటీతత్వం బలపడతాయని నితిన్ కుమార్ యాదవ్ ఆశాభావం వెలిబుచ్చారు.

## మీరు ఇచ్చిన సమాచారాన్ని ఆధారంగా తీసుకుని, వార్తను మరింత విస్తృతంగా, పత్రికలో ప్రచురించదగిన శైలిలో ఇలా రూపొందించవచ్చు

- నిజాయితీకి నిదర్శనం... ఉన్నత విద్యార్హతలతోనూ గ్రామాభివృద్ధికే అంకితం!
- అరడజనుకు పైగా ఉన్నత డిగ్రీలు సాధించినా గ్రామపంచాయతీ కార్యదర్శిగా ప్రజాసేవలో ఆదర్శంగా నిలుస్తున్న ఛట్ల గాయత్రి




**భైంసా, జూలై 10 (భారత శక్తి):** ప్రభుత్వ ఉద్యోగం అంటే కేవలం ఉపాధి మాత్రమే కాదు, సమాజానికి సేవ చేసే అవకాశమని నిరూపిస్తూ నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని వానల్పాడ్ గ్రామపంచాయతీ కార్యదర్శి ఛట్ల గాయత్రి తన విధి నిర్వహణలో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. అరడజనుకు పైగా ఉన్నత విద్యార్హతలు సాధించినప్పటికీ, గ్రామీణ ప్రజల అభ్యున్నతే తన లక్ష్యంగా భావించి గ్రామపంచాయతీ కార్యదర్శిగా నిబద్ధతతో సేవలందిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు.ఎంఎస్సీ (జియోగ్రఫీ), ఎంఏ (సోషియాలజీ), ఎంఏ (హిస్టరీ), ఎంఏ (పాలిటికల్ సైన్స్), ఎల్ఎల్‌బీ వంటి ఉన్నత విద్యను అభ్యసించిన ఆమె, విద్య అంటే ఉద్యోగం కోసం మాత్రమే కాకుండా సమాజానికి ఉపయోగపడే విజ్ఞానమని తన సేవల ద్వారా చాటిచెబుతున్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించగలరని, ఉన్నత విద్యతో పాటు బాధ్యతాయుతమైన ప్రజాసేవను సమర్థవంతంగా నిర్వహించవచ్చని ఆమె నిరూపిస్తున్నారు.2014లో ప్రభుత్వ ఉద్యోగం సాధించిన చట్ల గాయత్రి తొలి నియామకంగా బజార్‌హత్నూర్ మండలంలోని గిర్నూర్ గ్రామపంచాయతీలో కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. అక్కడ సమర్థవంతమైన పరిపాలనతో మంచి పేరు సంపాదించిన ఆమె, అనంతరం భైంసా మండలంలోని వానల్పాడ్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి గ్రామాభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ అమలు, గ్రామపంచాయతీ పరిపాలనలో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ విధులు నిర్వహిస్తున్నారు.ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఓపికగా విని, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి సత్వర పరిష్కారానికి కృషి చేయడం ఆమె ప్రత్యేకతగా నిలిచింది. కార్యాలయ నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన, నిజాయితీ, సేవాభావం వంటి విలువలను పాటిస్తూ సహచర ఉద్యోగులు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల ప్రశంసలను అందుకుంటున్నారు.ముఖ్యంగా మహిళగా కుటుంబ బాధ్యతలతో పాటు ఉన్నత విద్యను కొనసాగిస్తూ, ప్రభుత్వ ఉద్యోగంలో సమర్థవంతంగా రాణించడం ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల సాధికారతకు ఆమె జీవన ప్రయాణం ఒక స్ఫూర్తిదాయక ఉదాహరణగా నిలుస్తోందని అభిప్రాయపడుతున్నారు.ఉన్నత విద్య, వినయం, బాధ్యత, సేవాభావం, నిజాయితీ కలగలిపిన ఛట్ల గాయత్రి వంటి అధికారులు ప్రభుత్వ వ్యవస్థకు బలంగా నిలుస్తారని, గ్రామాభివృద్ధికి అంకితభావంతో పనిచేసే ఇలాంటి అధికారులను ప్రభుత్వం మరింత ప్రోత్సహించాలని గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

ప్రస్తుతం వానల్పాడ్ గ్రామపంచాయతీలో ఆమె అందిస్తున్న సేవలు ప్రజల విశ్వాసాన్ని మరింత బలపరుస్తూ, నిజాయితీతో పనిచేసే అధికారిణిగా ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి.

# చిన్నారుల విద్యకు

# అంగన్వాడీ కేంద్రం తొలి మెట్టు

- చిన్నారులకు ఎస్సై సుధాకర్ కుర్చీల బహూకరణ
- అంగన్వాడీ కేంద్రంలో ఎస్సై కూతురు విద్యాభ్యాసం.



**రేగొండ, జూలై 10 (భారత శక్తి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో శుక్రవారం నాలుగవ అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు రేగొండ ఎస్సై సుధాకర్ కుర్చీలు బహుకరించారు. రేగొండ మండల కేంద్రంలో నీ నాలుగవ అంగన్వాడీ పాఠశాలలో ఎస్సై సుధాకర్ దంపతుల కూతురు విద్యాభ్యాసం చేస్తున్నారు.కాగా అంగన్వాడీ సెంటర్ ను సందర్శించిన ఎస్సై సుధాకర్ చిన్నారులను చూసి ముచ్చట పడ్డారు.చిన్నారులు కింద కూర్చోవడం చూసి వారికోసం పదిహేను కుర్చీలు బహుకరించారు.ఈ సందర్భంగా ఎస్సై సుధాకర్ మాట్లాడుతూ చిన్నారుల విద్యకు అంగన్వాడీ కేంద్రాలు తొలి మెట్టు అన్నారు.ఇంత చిన్న వయసులో సెంటర్ కు వచ్చి చదువుకోవడం సంతోషంగా ఉంది అని చిన్నారులు దినదినం విద్యలో ఉన్నత స్థాయిలో ఎదగాలని ఆశీర్వదించారు. అంగన్వాడీ టీచర్ నామాల రజిత మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేస్తుందని దాతలు సహకరిస్తే, మరింత వసతులు చిన్నారులకు ఏర్పడతాయని అన్నారు. అంగన్వాడి కేంద్రంలో చదువుతున్న చిన్నారులు నేలపై కూర్చుని అక్షర జ్ఞానం నేరుస్తున్న చిన్నారులకు పదిహేను కుర్చీలు స్థానిక ఎస్ఐ సుధాకర్ బహుకరించడం ఆనందంగా ఉందన్నారు. చిన్నారులు కుర్చీలపై కూర్చుని చదువుకోవడం సంతోషంగా ఉందన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు దాతలు తమ వంతు సహకారం అంగన్వాడీ కేంద్రాలకు అందించాలని కోరారు. కార్యక్రమంలో హెల్పర్ శ్రీలత, మహిళ సంఘం అధ్యక్షురాలు సుమలత, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446,
Cell: 9550336688,94405 08078 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy,Executive Editor: M.Venugopal Reddy